# శ్రీ కృష్ణ సందేశం



బ్రహ్మర్షి పత్రీజీ

**క్లైబ్యం మాస్మగమః పార్థనైతత్త్వ య్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ (2-3)**

పదచ్ఛేదం : క్లైబ్యమ్, మా, స్మ, గమః, పార్థ,న, ఏతత్, త్వయి. ఉపపద్యతే, క్షుద్రమ్, హృదయదౌర్బల్యమ్, త్యక్త్వా, ఉత్తిష్ఠ, పరంతప.

**టీకా** : పార్థ= ఓ పార్థా; క్లైబ్యమ్ = నపుంసకత్వాన్ని; మా, స్మ, గమః = పొందకు; త్వయి= నీకు; ఏతత్= ఇది; న, ఉపపద్యతే = తగదు; పరంతప= శత్రువులను తపింప చేసే ఓ అర్జునా; క్షుద్రమ్, హృదయదౌర్బల్యమ్ = తుచ్ఛమైన ఈ మనో దౌర్బల్యాన్ని; త్యక్త్వా= విడిచి పెట్టి; ఉత్తిష్ఠ= లెమ్ము.

**తాత్పర్యం : "ఓ పార్థా ! నపుంసకత్వాన్ని తెచ్చుకోవద్దు. ఇది నీకు ఎంత మాత్రమూ తగదు. ఓ అర్జునా ! తుచ్ఛమైన ఈ హృదయ దౌర్బల్యాన్ని విడిచి పెట్టి యుద్ధానికి సంసిద్ధుడివి కా !"**

వ్యాఖ్యానం :

అధైర్యమే అనాధ్యాత్మికతకు సూచన !

అధైర్యమే ప్రపంచ జ్ఞాన లేమికి సూచన !

'అధైర్యం' అంటే హృదయదౌర్బల్యమే !

హృదయదౌర్బల్యం ఎప్పటికీ ఏహ్యమైనదే !

ధైర్యే సాహసే లక్ష్మి !

ధైర్యమే పూర్ణ ఆధ్యాత్మికానికి ప్రతీక !

ధైర్యమే ప్రాపంచిక పటిమ యొక్క ప్రతిబింబం !

ధైర్యమే ధర్మయుద్ధానికి మూలం !

ధర్మయుద్ధమే అంతిమ విజయానికి మార్గం !

అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చభాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితా ॥ (2 -11)

పదచ్ఛేదం : అశోచ్యాన్, అన్వశోచః, త్వమ్, ప్రజ్ఞావాదాన్, చ, భాషసే, గతాసూన్, అగతాసూన్, చ, న, అనుశోచంతి, పండితాః.

టీకా : త్వమ్ = నువ్వు; అశోచ్యాన్ = శోకింపదగని మనుష్యుల గురించి; అన్వశోచః = శోకిస్తున్నావు; చ = పైగా; ప్రజ్ఞావాదాన్ = పండితులు మాట్లాడే వచనాలను; భాషసే = పలుకుతున్నావు; గతాసూన్ = మరణించిన వారి గురించి, చ = మరి, అగతాసూన్ = బ్రతికి వున్న వారి గురించి; పండితాః = ఆత్మజ్ఞానం పొందినవారు; న, అనుశోచంతి = దుఃఖించరు.

**తాత్పర్యం :** ***"ఓ అర్జునా ! శోకింపదగని వారిని గురించి శోకిస్తున్నావు. పైగా పండితులు చెప్పేటటువంటి వచనాలు పలుకుతున్నావు ! కాగా పండితులైన వాళ్ళు చనిపోయినవాళ్ళ కోసం గానీ, బ్రతికియున్న వాళ్ళ కోసం గానీ శోకింపరు."***

వ్యాఖ్యానం :

శోకమే ఆత్మజ్ఞాన రహితత్వానికి సంకేతం !

దేహ భ్రాంతి వున్నవాడు ఎప్పుడూ శోకతప్తుడే !

ప్రతి ఒక్కరూ ఎప్పుడూ 'అశోకుడు' గా వుండాలి !

అందరినీ దుఃఖింపజేసేవారే రాక్షసులు !

సదా ఆనందించే వారే దేవతలు !

ఎప్పుడూ దుఃఖించేవారే మానవులు !

అల్పజ్ఞులు అయినవారు గొప్ప గొప్ప మాటలను ఎప్పుడూ పలుకకూడదు !

సర్వజ్ఞులు అయినవారు గొప్ప గొప్ప గుణాలను ప్రదర్శించాలి !

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామస్సర్వే వయమతః పరమ్॥ (2-12)

**పదచ్ఛేదం :** న, తు, ఏవ, అహమ్, జాతు, న, ఆసమ్, న, త్వమ్ ఇమే, జనాధిపాః, న, చ, ఏవ న, భవిష్యామః, సర్వే, వయమ్, అతః, పరమ్.

**టీకా :** న, తు, ఏవ = లేనేలేదు; అహమ్ = నేను; జాతు, న, ఆసమ్ = ఒకప్పుడు లేను అన్నది లేనే లేదు; త్వమ్ = నువ్వు; న = లేవు; ఇమే = ఈ; జనాధిపాః = రాజులు; న = లేరు; చ = మరి; న = లేరు; అతః పరమ్ = ఇకముందు; వయమ్ = మనం; సర్వే = అందరమూ; న, భవిష్యామః = లేకపోవడం అన్నది; న ఏవ= లేదు.

**తాత్పర్యం :** **"నేను ఏ కాలంలో లేనట్లూ కాదు: నువ్వు కూడా లేనట్లూ కాదు! అదే విధంగా ఈ రాజులందరూ ఏ కాలంలోనూ లేరని అనుకోవద్దు. అంతేకాదు మనమందరం కూడా భవిష్యత్తులో మళ్ళీ ఉండమనీ అనుకోవద్దు."**

**వ్యాఖ్యానం :**

శరీరం ఏర్పడకముందూ ఆత్మ వుంది !

శరీరం నశించిన తరువాతా ఆత్మ వుంటుంది !

శరీరానికి మూలం ఆత్మ !

ఆత్మ యొక్క తాత్కాలిక భౌతికపరమైన ఛాయ మాత్రమే శరీరం !

ఆత్మ అవినాశి, దేహం సవినాశి !

ఆత్మకు మూలం శరీరం కాదు !

శరీరానికి మూలం ఆత్మ !

దేహినోస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి ॥ (2 -11)

పదచ్ఛేదం : దేహినః, అస్మిన్, యథా, దేహే, కౌమారమ్, యౌవనమ్, జరా, తథా, దేహాంతర ప్రాప్తిః, ధీరః, తత్ర, న, ముహ్యతి.

టీకా : యథా = ఏ విధంగా; దేహినః = శరీరధారి అయిన జీవుడికి; అస్మిన్= ఈ; దేహే = శరీరంలో; కౌమారమ్ = బాల్యం; యౌవనమ్ = యౌవనం; జరా = ముసలితనం; తథా = అదే విధంగా; దేహాంతర ప్రాప్తిః = ఇంకొక శరీరం పొందుతున్నది; తత్ర = ఈ విషయంలో; ధీరః = ధీర పురుషుడు; న, ముహ్యతి = మోహాన్ని పొందడు.

తాత్పర్యం : "ఏ విధంగా జీవాత్మకు ఈ దేహం లో 'బాల్యం'. 'యౌవన'. 'వార్ధక్య' దశలు ప్రాప్తించడం అన్నది లోకహజమే. అదే విధంగా ఇంకొక శరీరం కూడా లభిస్తుంది. కనుక. ఆ విషయాన్ని గురించి ధీర పురుషులు మోహాన్ని పొందరు."

వ్యాఖ్యానం :

దేహ స్థితీ వుంది; దేహాంతర స్థితీ వుంది !

కౌమారం – యవ్వనం–
వృద్ధత్వం – ఈ దేహ స్థితులు ఎంత సహజమో
మరో శరీరాన్ని పొందడమూ అంతే సహజం !
జ్ఞాని చావుకు ఎప్పుడూ ఏడవడు!
జ్ఞాని చావుకు సదా సంతోషిస్తాడు –
క్రొత్త దేహాన్ని పొందుతాడు కనుక !

*న జాయతే(మ్రియతే వా కదాచిన్నాయం భూత్వాభవితా వా న భూయః ।*
*అజో నిత్య శ్శాశ్వతోయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ (2–20)*

పదచ్ఛేదం : న, జాయతే, (మ్రియతే, వా, కదాచిత్, న, అయమ్, భూత్వా భవితా, వా, న, భూయః, అజః, నిత్యః, శాశ్వతః, అయమ్, పురాణః, న, హన్యతే, హన్యమానే, శరీరే.

టీకా : అయమ్ = ఈ ఆత్మ; కదాచిత్ = ఎల్లప్పుడూ; న, జాయతే = పుట్టడం లేదు; వా = మరి; న, (మ్రియతే = మరణించదు కూడా; వా = మరి; భూత్వా = జన్మించి; భూయః = మళ్ళీ; న, భవితా = ఉండేది కాదు; అయమ్ = ఇది; అజః = పుట్టుక లేనిది; నిత్యః = నిత్యమైన; శాశ్వతః = సనాతనమైనది; పురాణ = అనాదియైనది; శరీరే = శరీరాన్ని; హన్యమానే = చంపబడినప్పటికీ; న, హన్యతే = చంపబడడం లేదు.

**తాత్పర్యం : "ఈ ఆత్మ ఎల్లప్పుడూ, పుట్టడం లేదు, చావడం లేదు. పుట్టి మళ్ళీ 'కొత్త' గా వుండేది కాదు: కారణం ఇది జన్మలేనిది, నిత్యమైనది, సనాతనమైనది, పురాతనమైనది. శరీరం చంపబడినా ఆత్మ అన్నది చంపబడదు.**

వ్యాఖ్యానం :

శరీరం + ఆత్మ = జీవుడు !

జీవుడు – శరీరం = ఆత్మ !

ఆత్మ ఒకప్పుడు పుట్టినది కాదు !

మరొకప్పుడు అది గిట్టేదీ కాదు !

ఆత్మ అన్ని కాలాల్లోనూ వుండేది !

ఆత్మ శాశ్వతమైన పదార్థం !

శరీరం చంపబడితే ఆత్మ చంపబడదు !

శరీరం వేరే ! ఆత్మ వేరే !

***వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ (2-22)***

పదచ్ఛేదం : వాసాంసి, జీర్ణాని, మథా, విహాయ, నవాని, గృహ్ణాతి, నరః, అపరాణి, తథా, శరీరాణి, విహాయ, జీర్ణాని, అన్యాని, అన్యాని, సంయాతి, నవాని, దేహీ.

టీకా : యథా = ఏ విధంగా, నరః = మానవుడు; జీర్ణాని = శిథిలమయిన; వాసాంసి = వస్త్రాలను; విహాయ = వదలిపెట్టి; అపరాణి, నవాని = వేరే క్రొత్త వస్త్రాలను; గృహ్ణాతి = గ్రహిస్తున్నాడో; తథా = ఆ విధంగానే; దేహీ = ఆత్మ; జీర్ణాని = శిథిలమైన; శరీరాణి = శరీరాలను; విహాయ = విడిచిపెట్టి; అన్యాని = ఇంకొక; నవాని = క్రొత్త శరీరాలను; సంయాతి = పొందుతున్నాడు.

తాత్పర్యం : ***" (ఒకవేళ నీవు ఈ శరీర వియోగానికే శోకిస్తున్నానని అనినచో అది కూడ యుక్తము కాదు. ఎందుకనగా) ఏ విధంగానైతే మానవుడు పాత వస్త్రాలను విడిచిపెట్టి, క్రొత్త వస్త్రాలను ధరిస్తున్నాడో, అదే విధంగా ఈ ఆత్మ కూడా పాత శరీరాలను విడిచిపెట్టి క్రొత్త శరీరాలను పొందుతోంది !"***

వ్యాఖ్యానం :

చినిగిపోయిన , శిథిలమైన వస్త్రాలను విసిరేయాలి !

కొంగ్రొత్త బట్టలను ఎంచక్కా వేసుకోవాలి !

శరీరాలను కూడా శిథిలమైతే వాటినీ విసిరేయాలి !

పాత భౌతిక శరీరాలు నశిస్తే నూతన సూక్ష్మ శరీరాల్ని ధరిస్తాం !

వస్త్రాలెంతో శరీరాలూ అంతే !

రెంటికీ ఏ మాత్రం భేదం లేదు !

మనం వస్త్రధారులం - అలాగే శరీరధారులం కూడా !

మనం దేహాలం కాదు ! 'దేహీ' స్వరూపులం !

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥ (2-23)

పదచ్ఛేదం : న, ఏనమ్, ఛిందంతి, శస్త్రాణి, న, ఏనమ్; దహతి, పావకః, న, చ, ఏనమ్, క్లేదయంతి, ఆపః, న, శోషయతి, మారుతః.

టీకా : ఏనమ్ = ఈ ఆత్మను; శస్త్రాణి = శస్త్రాలు; న, ఛిన్దన్తి = ఛేదింపలేవు; ఏనమ్ = ఈ ఆత్మను; పావకః = అగ్ని; న, దహతి = కాల్చలేదు; ఏనమ్ = ఈ ఆత్మను; ఆపః = నీరు; న, క్లేదయంతి = తడప లేదు; చ= మరి; మారుతః = గాలి; న, శోషయంతి = ఎండింపలేదు.

తాత్పర్యం : **"ఈ ఆత్మను శస్త్రాలు ఛేదింపలేవు: అగ్ని కాల్చ లేదు: నీరు తడిపి నానబెట్టనూ లేదు: మరి గాలి కూడా శుష్కింప చేయలేదు !"**

వ్యాఖ్యానం :

శస్త్రాలు శరీరాన్ని మాత్రమే ఛేదిస్తాయి – ఆత్మని కాదు !

నీరు శరీరాన్ని మాత్రమే తడుపుతుంది– ఆత్మని కాదు !

గాలి శరీరాన్ని మాత్రమే ఎండిస్తుంది – ఆత్మని కాదు !

అగ్ని శరీరాన్ని మాత్రమే దహిస్తుంది– ఆత్మని కాదు !

ఇంకెందుకూ భయం ?

ఇంకెందుకూ సంకోచం ?

ఇంకెందుకూ తాపత్రయాలు ?

**జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥** *(2-27)*

**పదచ్ఛేదం :** జాతస్య, హి, ధ్రువః, మృత్యుః, జన్మ, మృత్యువు, చ, తస్మాత్, అపరిహార్యే, అర్థే, న, త్వమ్ శోచితమ్, అర్హసి.

**టీకా :** హి = ఎంచేతంటే; జాతస్య = పుట్టిన వానికి; మృత్యుః = మరణం; ధ్రువః = నిశ్చయమే; చ = మరి; మృతస్య = చచ్చినవానికి; జన్మ = పుట్టడం; ధ్రువమ్ = తప్పదు; తస్మాత్ = అంచేత; అపరిహార్యే = తప్పించ వీలుకాని; అర్థే = విషయంలో; త్వం = నువ్వు; శోచితమ్ = దుఃఖించడానికి; న, అర్హసి = తగినవాడవు కాదు; (శోకింప తగదు)

**తాత్పర్యం :** **" ఏ విధంగా చూసినప్పటికీ పుట్టినవాడికి చావు తప్పదు. మరణించిన వాడు పుట్టడం తప్పదు. మరో మార్గంలేని ఈ విషయంలో దుఃఖించడం నీకు తగదు ! "**

**వ్యాఖ్యానం :**

'పుట్టుక' అంటే నాటక రంగప్రవేశం !

'గిట్టడం' అంటే నాటక రంగంలోంచి నిష్క్రమణం !

'పుట్టుక' అంటే దేహధారణం !

'గిట్టడం' అంటే దేహవిసర్జన !

పుట్టుకతోనే గిట్టడమూ నిశ్చయమైంది !

ఆధ్యాత్మికంగా మనిషి పరిపూర్ణుడవ్వనంత వరకూ, ప్రతి గిట్టుకా

మరో పుట్టుకకు దారి తీస్తుంది - ఇది సత్యం ! ఇది తథ్యం !

కనుక, సహజమైన రాకపోకలకు ఏడ్వడం అన్నది ఎంతటి మూర్ఖం !

ఒకసారి మానవజన్మ తీసుకున్న తరువాత ఇక

రాకపోకల చక్రం, మానవుడు మాధవుడయ్యేంత వరకూ, అనివార్యమైనది !

దేహీ నిత్యమవధ్యోయం దేహే సర్వస్య భారత ।
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥ (2-30)

పదచ్ఛేదం : దేహీ, నిత్యమ్, అవధ్యః, అయమ్, దేహే, సర్వస్య, భారత, తస్మాత్, సర్వాణి, భూతాని, న, త్వమ్, శోచితమ్, అర్హసిజ.

టీకా : భారత = ఓ అర్జునా; అయమ్ = ఈ ; దేహీ = ఆత్మ సర్వస్య = అందరి యొక్క; దేహే = దేహంలో; నిత్యమ్ = ఎల్లప్పుడు; అవధ్య = చంప వీలుగానిది; తస్మాత్ = అంచేత; సర్వాణి = సమస్త; భూతాని = ప్రాణుల గురించి; త్వమ్ = నువ్వు; శోచితమ్ = దుఃఖించడానికి; న, అర్హసి = తగినవాడవాడవు కాదు.

**తాత్పర్యం : " అర్జునా ! అందరి దేహాలలోని ఈ ఆత్మ ఎల్లప్పుడు చంపవీలుగానిది. అంచేత సమస్తమైన ప్రాణుల గురించి దుఃఖించడానికి తగినవాడవు కాదు ! "**

వ్యాఖ్యానం :

'దేహం' వేరే !, 'దేహి' వేరే !

దేహం నశించే వస్తువు !
దేహి నశించని వస్తువు !
దేహి ఎప్పటికీ వధింపబడదు !
వధింపబడేవి ప్రాణుల దేహాలే !
కనుక, ఏ ప్రాణీ చావదు !
ఇంకెందుకు దుఃఖం ?
ఇంకెందుకు ప్రార్థనలు ?
ఇంకెందుకు భజనలు ?
ఇంకెందుకు వ్రతాలు ?

**హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీమ్ ।**
**తాస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ (2-37)**

**పదచ్ఛేదం :** హతః, వా, ప్రాప్స్యసి, స్వర్గమ్, జిత్వా, వా భోక్ష్యసే, మహీమ్, తస్మాత్, ఉత్తిష్ఠ, కౌంతేయ, యుద్ధాయ, కృతనిశ్చయః.

**టీకా :** వా = ఒకవేళ; హతః = చంపబడితే; స్వర్గమ్ = స్వర్గాన్ని; ప్రాప్స్యసి = పొందుతావు; జిత్వా = జయిస్తే, మహీమ్ = పృథ్వీరాజ్యాన్ని; భోక్ష్యసే = అనుభవిస్తావు; తస్మాత్ = అంచేత; కౌంతేయ = ఓ అర్జునా; యుద్ధాయ = యుద్ధం చేయడానిక్కి ; కృతనిశ్చయః = నిశ్చయించుకుని; ఉత్తిష్ఠ = నిలబడు.

**తాత్పర్యం :** ***"ఒకవేళ నీవు యుద్ధంలో చంపబడితే స్వర్గాన్ని పొందుతావు. ఒకవేళ యుద్ధంలో జయిస్తే పృథ్వీ రాజ్యాన్నంతటినీ అనుభవిస్తావు కనుక ఓ అర్జునా! యుద్ధం చేయడానికి నిశ్చయించుకుని నిలబడు."***

**వ్యాఖ్యానం :**

ఏ మనిషి అయినా, చనిపోయిన తరువాత స్వర్గానికే వెళ్తాడు!

నూటతొంభై లక్షల కోట్ల స్వర్గాలు !

' పాపులు ' కొంచెం తక్కువ స్థాయి స్వర్గాలకెళ్తే

'పుణ్యాత్ములు' కొంచెం గొప్ప స్థాయి అయిన స్వర్గాల కెళ్తారు అంతే !

అంతేకానీ ' నరకలోకాలు ' ఎక్కడా లేవు ! వున్నవన్నీ ' స్వర్గలోకాలే ' !

కనుక, ఇంకెందుకూ భయం ?

ఇక నిర్భయంగా భూలోకంలో ధర్మస్థాపన కోసం యుద్ధం చేయాల్సిందే !

నేహాభిక్రమనాశోఽస్తిప్రత్యవాయో న విద్యతే ।
స్వల్పమప్యస్య ధర్మ స్యత్రాయతే మహతో భయాత్ ॥ (2-40)

పదచ్ఛేదం : న, ఇహ, అభిక్రమనాశః, అస్తి, ప్రత్యవాయః, న విద్యతే, స్వల్పమ్, అపి, అస్య, ధర్మస్య, త్రాయతే, మహతః, భయాత్.

టీకా : ఇహ = ఈ కర్మయోగంలో; అభిక్రమనాశః = ప్రారంభించినది, నాశనం; న, అస్తి = లేదు; పత్యవాయః = విపరీత దోషం; న, విద్యతే = ఉండదు, అస్య = ఈ ; ధర్మస్య = ధర్మం యొక్క స్వల్పమ్ = స్వల్పమైన; అపి =కూడా; మహతః = గొప్పదైన; భయాత్ = భయం నుంచి; త్రాయతే= రక్షిస్తుంది.

తాత్పర్యం : " ఈ కర్మయోగంలో ప్రారంభించినది నాశనం ఉండదు. పైగా విపరీత దోషం కూడా ఉండదు. ఈ ధర్మం స్వల్పమైనా గొప్ప భయం నుంచి రక్షిస్తుంది. "

వ్యాఖ్యానం :

' సత్ విద్య ' అభ్యాసం కొంచెం అయినా అది గొప్పే !

' ఆత్మవిద్య ' ను కొంచెం తెలుసుకున్నా అదిసాటిలేనిదే !

' యోగసాధన ' ను కొంచెం చేసినా ఎంతో మనఃశాంతే !

' ధర్మా ' న్ని కొద్దిగా ఆచరించినా అది ఎంతో లాభకరమే !

' అధర్మా 'నికి కొద్దిగా ఒగ్గినా అది ఎంతో నష్టదాయకమే !

' అసత్య విద్య ' ను కొంచెం తలపెట్టినా అది పెద్ద అనర్థమే !

' సన్మార్గం ' లో ప్రారంభించినదేదీ ఎప్పటికీ వృథా కాజాలదు !

ఎంత ప్రారంభిస్తే అంతే భవిష్యత్తుకు పునాది అవుతుంది !

**వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునన్దన ।**
**బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్ ॥ (2-41)**

**పదచ్ఛేదం :** వ్యవసాయాత్మికా, బుద్ధిః, ఏకా, ఇహ, కురునందన, బహుశాఖాః, హి, అనంతాః, చ, బుద్ధయః, అవ్యవసాయినామ్.

**టీకా :** కురునందన = అర్జునా ; ఇహ = ఈ కర్మయోగంలో; వ్యవసాయాత్మికా = నిశ్చయాత్మకమైన; బుద్ధిః = బుద్ధి; ఏకా ఒక్కటే; అవ్యవసాయినామ్= స్థిరబుద్ధి లేని; బుద్ధయః = బుద్ధులు; హి = తప్పకుండా; బహుశాఖాః = అనేక విధాలుగా; చ = మరి; అనంతాః = లెక్కకు మించి.

**తాత్పర్యం :** ***" అర్జునా ! ఈ కర్మయోగంలో నిశ్చయాత్మకమైన బుద్ధి ఒక్కటే ఉంటుంది. అయితే, స్థిరబుద్ధిలేని బుద్ధులు తప్పకుండా అనేక విధాలుగా లెక్కకు మించి ఉంటాయి."***

**వ్యాఖ్యానం :**

నిశ్చయమైన మనస్సే ' బుద్ధి ' అనబడుతుంది !

ఏకాగ్రతను చెందిన మనస్సే ' సూక్ష్మం ' అవుతుంది !

నియంత్రించబడని మనస్సు పరిపరి విధాల పరుగులెత్తుతూంటుంది !

నిగ్రహపడని మనస్సు అనంత విధాలుగా బాధలు పెడ్తూంటుంది !

నియంత్రించబడిన మనస్సు ఒక్క బాధనైనా పెట్టదు !

నిగ్రహింపబడిన మనస్సు ఒక్క రీతిలోనే స్థిరంగా వుంటుంది !

నియంత్రించబడినా మనస్సే బుద్ధి !

నిగ్రహింపబడిన మనస్సే బుద్ధి !

బుద్ధి అన్నింటిలోనూ హాయిగా జీవిస్తుంది !

మనస్సు ఒక్కదానిలోనైనా హాయిగా జీవించలేదు !

త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ (2-45)

**పదచ్ఛేదం :** త్రైగుణ్యవిషయాః, వేదాః, నిస్త్రైగుణ్యః, భవ, అర్జున, నిర్ద్వంద్వః, నిత్యసత్త్వస్థః ; నిర్యోగక్షేమః ఆత్మవాన్.

**టీకా :** అర్జున = అర్జునా; వేదాః = వేదాలు; త్రైగుణ్యవిషయాః = త్రిగుణాత్మకమైన విషయాలను; నిస్త్రైగుణ్యః = త్రిగుణాలలో ఆసక్తిలేనివాడవై; నిత్యసత్త్వస్థ = నిరంతరం శుద్ధసత్త్వాన్ని; నిర్యోగక్షేమః = యోగక్షేమాలు లేనటువంటి; ఆత్మవాన్ = ఆత్మజ్ఞానివి; భవ = అవ్వు.

**తాత్పర్యం :** " అర్జునా ! వేదాలు త్రిగుణాత్మకమైన విషయాలను త్రిగుణాలలో ఆసక్తిలేనివాడవై నిరంతరం శుద్ధసత్త్వాన్నీ యోగక్షేమాలూ లేనటువంటి ఆత్మజ్ఞానివి అవ్వు."

**వ్యాఖ్యానం :**

తమో, రజో, సత్త్వ గుణాలే త్రిగుణాలు !

త్రిగుణాల గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నాయి వేదాలు !

' తమో '- అంటే తనువు గురించిన విషయాలు !

' రజో ' - అంటే మనస్సుకు సంబంధించిన విశేషాలు !

' సత్త్వ '- అంటే శ్రేయస్సుకు సంబంధించిన సూత్రాలూ !

అయితే, వీటన్నింటినీ క్రమక్రమంగా, అచిరకాలంలో దాటాలి !

ద్వంద్వాతీతులం కావాలి; శుద్ధసత్త్వాన్ని పొందాలి !

ఇంకా పైపైకి పోయి-

యోగాన్నీ పట్టించుకోకూడాదు- క్షేమాన్నీ పట్టించుకోకూడదు !

ఆత్మకు ' యోగం ', అంటే ' అభివృద్ధి ', ఎక్కడ !

ఆత్మకు ' క్షేమం ', అంటే ' శ్రేయస్సు ', అన్నది ఎక్కడ ?

అన్ని యోగాలూ తనలో కలిగి ఉన్నదే ' ఆత్మ ' !

అన్ని క్షేమాలూ తన నైజంగా ఉన్నదే ' ఆత్మ ' !

ఆత్మవంతుడివిగా సదా వుండాలి !

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణి ॥ (2-47)

**పదచ్ఛేదం :** కర్మణి, ఏవ, అధికారః, తే, మా, ఫలేషు, కదాచన, మా, కర్మఫలహేతుః, భూః, మా, తే, సంగః, అస్తు, అకర్మణి.

**టీకా :** తే = నీకు; కర్మణి, ఏవ = కర్మచేయడానికి; అధికారః = అధికారం వుంది; ఫలేషు = ఫలములలో; కదాచన, మా = ఎప్పుడూ లేదు; కర్మఫ హేతుః = కర్మఫలితాలకు కారణం; మా, భూః = కావద్దు; తే = నీకు; అకర్మణి = కర్మలు చేయకుండా; సంగః= ఆసక్తి; మా, అస్తు = ఉండకుండు గాక.

**తాత్పర్యం :** **" నీకు కర్మచేయడానికే అధికారం వుంది ఫలితాల నిర్ణయంలో ఎప్పుడూ హస్తం లేదు. కనుక. నువ్వు కర్మఫలితాలకు కారణం కావద్దు. అలా అని కర్మలు చేయకుండా వుండడానికీ అసక్తుడవు కావద్దు ! "**

**వ్యాఖ్యానం :**

కర్మలను చేయడానికే మనకు హక్కు ఉంది !

కర్మలను సదా అప్రమత్తతతో చేస్తూ ఉండాలి !
ఎన్ని ఎక్కువ కర్మలను చేస్తూంటే అంత గొప్పవారం మనం !
' అష్టావధాని ' గా కావాలి ! ' శతావధాని ' గా కావాలి !
' సహస్రావధాని ' గా కావాలి !
అదీ మన ధ్యేయం ! అదీ మన గమ్యం !
' అకర్మణత్వం ' అన్నది ఎప్పుడూ వుండకూడదు !
సోమరిపోతుగా, నిద్రపోతుగా మనం ఎప్పుడూ ఉండకూడదు !
ఎప్పుడూ ' కర్మిష్ఠి ' గానే ఉండాలి !
చేస్తున్న కర్మలకు ఎప్పుడూ ' లెక్కలు ' కట్టకూడదు !
' లెక్కలు ' కట్టడానికి మన దగ్గర సరి అయిన ' డేటా ' ఏమీ లేదు !
లెక్కలనూ, ఫలితాలనూ పూర్ణ సృష్టికే వదిలేయాలి !
సృష్టికి మాత్రమే తెలుసు ' సరి అయిన లెక్కలు ' కట్టడం !
జన్మ జన్మల లెక్కల ప్రకారం రావల్సింది అంతా వచ్చే తీరతుంది !
జన్మ జన్మల లెక్కల ప్రకారం పోవాల్సిందంతా పోయే తీరుతుంది !

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వాసమత్వం యోగ ఉచ్యతే॥ (2-48)

పదచ్ఛేదం : యోగస్థః, కురు, కర్మాణి, సంగమ్, త్యక్త్వా, ధనంజయ, సిద్ధ్యసిద్ధ్యోః సమః, భూత్వా, సమత్వమ్, యోగఃఉచ్యతే.

టీకా : ధనంజయ = అర్జునా; సంగమ్ = ఆసక్తిని; త్యక్త్వా = వదలి; సిద్ధసిద్ధ్యోః = సిద్ధి అసిద్ధి రెంటిలో; సమః = సమాన బుద్ధిని; భూత్వా = కలిగి; యోగస్థః = యోగంలో నిలిచి; కర్మాణి = కర్తవ్య కర్మలన్నీ ; కురు = ఆచరించు; సమత్వమ్ = సమత్వ బుద్ధి; యోగః = యోగం అని; ఉచ్యతే = చెప్పబడును..

**తాత్పర్యం : " ధనంజయా ! ఆసక్తి వదలి సిద్ధి, అసిద్ధి అనే ఈ రెంటిలో సమబుద్ధి కలిగి, యోగంలో నిలిచి కర్తవ్య కర్మలు ఆచరించు. సమత్వాన్నే 'యోగం' అని అంటారు "**

వ్యాఖ్యానం :

' యోగస్థితి ' లోనే కర్మలన్నీ చేయాలి !

' యోగస్థితి ' లో వుండకుండా చేసే కర్మలన్నీ అనర్థహేతువులే !

కర్మలను చేస్తూ వున్నా వాటి పట్ల ఆసక్తి రహితుడిలాగా వుండాలి !

ఫలితాలను - అవి పూర్తిగా ఫలించినా, కొద్దిగా ఫలించినా,-

వాటిని సమభావనతోనే గ్రహించాలి !

సమత్వమే అత్యంత గొప్పదైనది !

సమత్త్వమే నిజమైన ' యోగం ' అనిపించుకుంటుంది !

'సమత్త్వం' అంటే అన్నింటినీ సరి సమానంగా చూడడం !

మొదట యోగస్థితిని పొందాలి- తరువాత - ఆ

చక్కటి చిక్కటి యోగస్థితిలో - సమస్త కర్మలనూ చేయాలి !

ఆత్మనో మోక్షాయ - జగద్ధితాయ చ !

మొదట ఆత్మకు మోక్షం - తరువాతే జగత్ హితం కదా !

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ (2-50)**

**పదచ్ఛేదం :** బుద్ధియుక్తః, జహాతి, ఇహ, ఉభే, సకృత దుష్కృతే, తస్మాత్, యోగాయ, యుజ్యస్వ, యోగః, కర్మసు, కౌశలమ్.

**టీకా :** బుద్ధియుక్తః = సత్వబుద్ధి వున్న; సుకృత దుష్కృతే = పుణ్యపాపాలను; ఉభే = రెండింటినీ; ఇహ = ఈ లోకంలోనే; జహాతి = విడుస్తున్నాడు; తస్మాత్ = అందుచే; యోగాయ = యోగాన్ని; యుజ్యస్వ = పూనుకో; యోగః = యోగం; కర్మసు = కర్మలలో; కౌశలమ్ = నేర్పరితనం.

**తాత్పర్యం :** **"సత్యబుద్ధి గల పుణ్యాపాపములను రెండింటినీ ఈ లోకంలోనే విడుస్తూ యోగాన్ని పూనుకో! యోగమే కర్మలలోని కౌశలం!"**

**వ్యాఖ్యానం :**

' బుద్ధి వున్నవాడు ' అంటే ' ఆత్మజ్ఞానం వున్నవాడు ' అన్నమాట !

ఆధ్యాత్మిక పరిభాషలో ' బుద్ధి ' అంటే ' ఆత్మజ్ఞానం ' !

' ఆత్మజ్ఞానం ' అంటే జనన – మరణ చక్ర విశేష పరిజ్ఞానం !

' ఆత్మజ్ఞాని ' మంచి, చెడులను రెంటినీ ఎప్పుడూ వదిలేస్తాడు !

' ఆత్మ జ్ఞాని కేవలం ' మరింత యోగం ' కోసమే పరితపిస్తాడు !

' ఆత్మజ్ఞాని ' కేవలం ' మరింత అవగాహన ' కోసమే యోగ సాధనలు చేస్తూంటాడు !

ఎన్ని కర్మలను చేస్తూ ఉన్నా ఏ కర్మల పర్యవసానాలకూ అంటని

రహస్యాన్ని మాత్రం అభ్యసిస్తూ ఉండాలి – అదే కర్మల్లో కౌశల్యం !

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మ బంధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్ ॥ (2-51)

పదచ్ఛేదం : కర్మజమ్, బుద్ధియుక్తాః, హి, ఫలమ్, త్యక్త్వా మనీషిణః,

జన్మబంధవినిర్ముక్తాః, పదమ్, గచ్ఛంతి, అనామయమ్.

టీకా : హి = ఎంచేతంటే; బుద్ధియుక్తాః = సత్వబుద్ధి గలిగి; మనీషిణః = జ్ఞానులు; కర్మజమ్ = కర్మలవల్ల కలిగే; ఫలమ్ = ఫలితాన్ని; త్యక్త్వా = విడిచి; జన్మబంధవినిర్ముక్తాః = జన్మ అనే బంధం నుంచి విడివడి; అనామయమ్ = దుఃఖరహితమైన; పదమ్ = పరమపదాన్ని; గచ్ఛంతి = పొందుతారు.

తాత్పర్యం : " ఎంచేతంటే సత్వబుద్ధి గల జ్ఞానులు కర్మల వల్ల కలిగే ఫలితాన్ని విడిచి జన్మ అనే బంధం నుండి విడివడి దుఃఖరహితమైన పరమపదాన్ని పొందుతారు. "

వ్యాఖ్యానం :

ఆత్మజ్ఞానులు వివేకవంతులు !

ఏం చేయాలో తెలిసినవాళ్ళు !

అన్నీ ఎలా చేయాలో తెలిసినవాళ్ళు !

వారు కర్మలవల్ల లభించే ఫలాలను ఎంత మాత్రం ఆశించరు !

తద్వారా జన్మ కర్మల బంధాలనుంచి సంపూర్ణంగా విముక్తులవుతారు !

' కారణం ' లేనప్పుడు ' కార్యం ' ఎలా వుంటుంది ?

వివేకవంతులు వారి వివేకపూరిత జ్ఞానమయ కర్మల ద్వారా,

శాశ్వతమైన ' దుఃఖరహిత పదాన్ని '–

మోక్షాన్ని – పొందుతారు !

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనో గతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టఃస్థిత ప్రజ్ఞస్తదోచ్యతే ॥ (2-55)

**పదచ్ఛేదం :** ప్రజహాతి, యదా, కామాన్, సర్వాన్, పార్థ, మనోగతాన్, ఆత్మని, ఏవ, ఆత్మనా, తుష్టః, స్థితప్రజ్ఞః, తదా, ఉచ్యతే.

**టీకా :** పార్థ = అర్జునా; యదా = ఎప్పుడూ; మనోగతాన్ = మనస్సులో వుండే; సర్వాన్ = సమస్తాలైన; కామాన్ = కోరికలను; ప్రజహాతి = వదలి వేస్తాడో; ఆత్మనా = ఆత్మలో; ఆత్మని ఏవ = ఆత్మలోనే; తుష్టః = సంతుష్టుడై వుంటాడో; తదా = అప్పుడే; స్థిత ప్రజ్ఞః = స్థితప్రజ్ఞుడని; ఉచ్యతే = చెప్పబడుతున్నాడు.

**తాత్పర్యం :** **" అర్జునా ! ఎప్పుడు పురుషుడు మనస్సులో వుండే సమస్తాలైన కోరికలను వదలివేస్తాడో. ఆత్మలోని ఆత్మసంతుష్టుడై వుంటాడో అప్పుడే స్థితప్రజ్ఞుడని చెప్పబడుతున్నాడు."**

**వ్యాఖ్యానం :**

అవసరాలు శరీరానికి సంబంధించినవి !

కోరికలు మనస్సుకు సంబంధించినవి !

అవసరాలు వేరే ! కోరికలు వేరే !

అవసరాలు ఎప్పుడూ అసమంజసమే !

కోరికలు ఎప్పుడూ అసమంజసమే !

ప్రాపంచికమైన అత్యాశలే కోరికలు !

ఆధ్యాత్మికమైన అవసరాలే ఆశయాలు !

అన్ని రకాల కోరికలనూ త్యజించి జీవించాలి !

' తానే అంతా అయినప్పుడు ' ఇంక ప్రత్యేక కోరికలనకు తావెక్కడ ?

కోరికలలో తిష్టవేసినవాడు సగటు మానవుడు !

ఆత్మలో తిష్టవేసినవాడు స్థిత ప్రజ్ఞుడు !

ఆత్మలో తిష్టవేసినవాడికే ప్రపంచమంతా దాసోహం !

యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ (2-58)

పదచ్ఛేదం : యదా, సంహరతే, చ, అయమ్, కూర్మః, అంగాని, ఇవ, సర్వశః, ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా.

టీకా : చ, కూర్మః= తాబేలు; సర్వశః=అన్ని వైపులనుంచి; అంగాని= అవయవాల్ని; ఇవ=ఏ విధంగా; యదా=ఎప్పుడు; అయమ్ః పురుషుడు; ఇంద్రియార్థేభ్యః= ఇంద్రియ విషయాల నుంచి; ఇంద్రియాణి= ఇంద్రియాలను, సంహరతే= వెనక్కి మళ్ళిస్తున్నాడో; తస్య = అతని, ప్రజ్ఞా=జ్ఞానం; ప్రతిష్ఠితా = స్థిరమైనది.

తాత్పర్యం : **" తాబేలు తన అవయవాల్ని అన్ని వైపుల నుంచి ఏ విధంగా లోపలికి ముడుచుకుంటుందో, పురుషుడు ఇంద్రియాలను వాని విషయాల నుంచి వెనక్కి మళ్ళిస్తున్నప్పుడు అతని జ్ఞానం స్థిరంగా వుంటుంది."**

వ్యాఖ్యానం :

అవసరమున్నప్పుడే ఆయుధ ప్రహారం చేయాలి !

అవసరం లేనప్పుడు ఆయుధాలను ఎంచక్కా ప్రక్కన బెట్టాలి !

ఇంద్రయాలు భౌతిక జీవనార్థం వుపయోగించే ఉపకరణాలు మాత్రమే !

వాటి అవసరం తీరగానే వాటిని వెంటనే ఉపసంహరించేయాలి !

ఇంద్రియాల అవసరం వున్నప్పుడే వాటిని వ్యక్తపరచాలి !

అవయావాల అవసరం లేనప్పుడు తాబేలు వాటిని లోపలికి

లాక్కుంటుంది ! అలాగే ప్రతి యోగీ కూడా జీవించాలి !

అలా చేసేవాడి శక్తి ఎప్పుడూ విజృభించి వుంటుంది !

అలా చేసేవాడి జ్ఞానం ఎప్పుడూ సునిశితమై వుంటుంది !

**ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే ।**

**సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభి జాయతే ॥ (2-62)**

**పదచ్ఛేదం :** ధ్యాయతః, విషయాన్, పుంసః, సంగః, తేషు, ఉపజాయతే, సంగాత్, సంజాయతే, కామః, కామాత్, క్రోధః, అభిజాయతే.

**టీకా :** విషయాన్ = విషయాలను; ధ్యాయతః = చింతిస్తున్న; పుంసః = పురుషుడికి; తేషు = ఆ విషయాలలో; సంగః = ఆసక్తి; ఉపజాయతే = కలుగుతోంది; సంగాత్ = ఆసక్తి వలన; కామః = కోరిక; సంజాయతే = పుడుతోంది; కామాత్ = అలాంటి కోరిక వలన; క్రోధః = కోపం; అభిజాయతే = కలుగుతోంది.

**తాత్పర్యం :** **"విషయాన్ని గురించి చింతిస్తున్న పురుషుడికి విషయాలలో ఆసక్తి కలుగుతోంది. ఆసక్తి వలన కోరిక పుడుతోంది. కోరిక వలన కోపం కలుగుతోంది."**

**వ్యాఖ్యానం :**

' ధ్యాస ' అన్నది అచిరకాలంలో ' సంగం ' గా మారుతుంది !

ఏ విషయాల మీద మన ' ధ్యాస ' వుంటుందో –

ఆ విషయాల పట్ల క్రమక్రమంగా సంగం, ' ఆసక్తి ' జనిస్తుంది !

ఏ విషయాల పట్ల ఆసక్తి, సంగం అన్నవి ఉంటాయో

ఆ విషయాల పట్ల క్రమేపీ ' కామం ' జనిస్తుంది !

' కామం ' అంటే తీవ్రమైన వాంఛ !

' కామం ' అన్నది అడ్డగింపబడినప్పుడు–

అది వెంటనే ' క్రోధం ' గా మారుతుంది !

' కామం ' లేకపోతే ' క్రోధం ' వుండదు !

' సంగం ' లేకపోతే ' కామం ' పుట్టదు !

' కామం ' లేకపోతే ' సంగం ' వుండదు !

' సంగం ' అంటే ' ఎటాచ్‌మెంట్ ' !

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః ।
స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ (2-63)

పదచ్ఛేదం : క్రోధాత్, భవతి, సమ్మోహః, సమ్మోహాత్, స్మృతి విభ్రమః, స్మృతి భ్రంశాత్, బుద్ధినాశః, బుద్ధినాశాత్, ప్రణశ్యతి.

టీకా : క్రోధాత్ = కోపం వల్ల; సమ్మోహః = వివేకం; భవతి = కలుగుతోంది; సమ్మోహాత్ = అవివేకం వల్ల; స్మృతివిభ్రమః = స్మరణ శక్తి నశిస్తుంది; స్మృతి భ్రంశాత్ = స్మరణశక్తి నశించినప్పుడు; బుద్ధి నాశః = బుద్ధి నశిస్తోంది; బుద్ధినాశాత్ = బుద్ధి నశించినప్పుడు; ప్రణశ్యతి = పతితుడవుతున్నాడు.

తాత్పర్యం : " కోపం వల్ల అవివేకం కలుగుతుంది. అవివేకం వల్ల స్మృతి నశిస్తోంది. స్మృతి నశించినప్పుడు బుద్ధి నశిస్తోంది. బుద్ధి నశించినప్పుడు పతితుడు అవుతున్నాడు."

వ్యాఖ్యానం :

' క్రోధం ' వలన మోహంలో కొట్టుకుపోతాడు మనిషి !

' మోహం ' అన్నది ' అతి ' యొక్క విశృంఖల విజృంభణ !

' మోహం ' వల్ల విషయాల స్పృహను పూర్తిగా కోల్పోతాడు !

ఆ విధమైన స్మృతినాశం వల్ల – ఏ మాత్రం బుద్ధి

అంతవరకూ వున్నా – అది కాస్తా మటుమాయమవుతుంది !

' బుద్ధి ' అంటే ' విచక్షణా జ్ఞానం ' !

విచక్షణా జ్ఞానం నశించినప్పుడు – అదే మృత్యువు !

వాస్తవానికి అంతకన్నా మృత్యువు ఏముంది ?

శరీర నాశనం ' మృత్యువు ' కాదు గదా ! .

మరి ఏది మృత్యువు ? బుద్ధి నాశనమే మృత్యువు !

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతే మునేః ॥ (2-69)**

**పదచ్ఛేదం :** యా, నిశా, సర్వభూతానామ్, తస్యామ్, జాగర్తి, సంయమీ, యస్యామ్, జాగ్రతి, భూతాని, సా, నిశా, పశ్యత, మునేః.

**టీకా :** సర్వభూతానామ్ = సమస్త ప్రాణులకి; యా = ఏది;నిశా = రాత్రో; తస్యామ్ = దానిలో; సంయమీ = స్థితప్రజ్ఞుడైన యోగి; జాగర్తి = మేలుకుని ఉంటాడు; యస్యామ్ = దేనిలో; భూతాని = సకల ప్రాణులూ; జాగ్రతి = మేలుకుని ఉంటున్నారో; పశ్యతః = (పరమాత్మ తత్త్వాన్ని) తెలుసుకునేటటువంటి; మునేః = మునికి; సా = అది; నిశా = రాత్రి.

**తాత్పర్యం :** **" సమస్త ప్రాణులకి ఏది రాత్రో. దానిలో స్థితప్రజ్ఞుడైన యోగి మేలుకుని వుంటాడు దేనిలో సమస్త ప్రాణులూ మేలుకుని ఉంటాయో పరమార్థ తత్త్వాన్ని తెలుసుకునేటటువంటి మునికి అది రాత్రి."**

**వ్యాఖ్యానం :**

మామూలు మనుషులు ఏ విషయాల్లోనైతే అజాగ్రత్తగా వుంటారో-

వాటి పట్ల యోగులు అతి జాగ్రత్తగా వుంటారు !

మామూలు మనుష్యులు ఏ విషయాల పట్ల అతి జాగరూకులై వుంటారో-

వాటి పట్ల మునులు అతి నిరాసక్తులై వుంటారు !

అలాగే సకల ప్రాణికోటీ రాత్రి నిద్రిస్తూ వుంటుంది !

కానీ, యోగుల సమూహం రాత్రిళ్ళు మేల్కొని వుంటుంది !

సకల ప్రాణికోటీ పగలు శ్రమిస్తూంటుంది.

కానీ, జ్ఞానులు పగలు సమయంలో అంతగా శ్రమించరు !

ఏషా బ్రాహ్మీ స్థితిఃపార్థనైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వా స్యామంతకాలేపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥ (2-72)

**పదచ్ఛేదం :** ఏషా, బ్రాహ్మీ, స్థితిః, ప్రార్థ, న, ఏనామ్, ప్రాప్య, విముహ్యతి, స్థిత్వా, అస్యామ్, అంతకాలే, అపి, బ్రహ్మనిర్వాణమ్, ఋచ్ఛతి.

**టీకా :** పార్థ = ఓ అర్జునా, ఏషా = ఇది; బ్రాహ్మీ = బ్రహ్మనిష్ఠ; స్థితిః = స్థితి; ఏనామ్ = దీనిని; ప్రాప్య = పొంది న, విముహ్యతి = మోహాన్ని పొందరు; అంతకాలే = మరణసమయంలో; అపి = కూడా; అస్యామ్ = ఈ బ్రాహ్మీస్థితిలో; స్థిత్వా = ఉండి; బ్రహ్మనిర్వాణమ్ = బ్రహ్మానందాన్ని; ఋచ్ఛతి = పొందుతున్నాడు.

**తాత్పర్యం :** **"బ్రహ్మనిష్ఠ స్థితిని పొందినవాడు మోహాన్ని పొందడు. మరణ సమయంలో కూడా బ్రాహ్మీస్థితిలో ఉండి బ్రహ్మానందాన్ని పొందుతున్నాడు."**

**వ్యాఖ్యానం :**

'బ్రహ్మనిష్ఠ' అన్నది జ్ఞానయోగం యొక్క అంతిమ స్థితి !

దీనిని పొందితే ఇక ' మోహం ' లేదు !

మరణ సమయంలో కూడా బ్రహ్మనిష్ఠ చలించదు !

' బ్రహ్మనిష్ఠ ' వున్నవాడికే యదార్థ జ్ఞానం కలుగుతుంది !

యదార్థ జ్ఞానం వల్ల వున్నది వున్నట్లు తెలుస్తుంది !

లేనిది లేనట్లుగా తెలుస్తుంది !

అంతకన్నా ఇక కావల్సిందేముంది ?

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృతే ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వఃప్రకృతిజైర్గుణైః ॥ (3-5)**

**పదచ్ఛేదం :** న, హి, కశ్చిత్, క్షణమ్, అపి, జాతు, తిష్ఠతి, అకర్మకృత్, కార్యతే, హి, అవశః, కర్మ, సర్వః, ప్రకృతిజైః, గుణైః.

**టీకా :** హి = నిస్సందేహంగా, కశ్చిత్ = ఏ మానవుడు కూడా; జాతు= ఏ సమయంలో కూడా; క్షణమ్ = రెప్పపాటు కాలం; అపి = అయినప్పటికీ; అకర్మకృత్ = ఏ పనీ చేయకుండా; న తిష్ఠతి = ఉండలేదు; హి = ఎంచేతంటే; సర్వః = సమస్త మనుష్య సముదాయం; ప్రకృతిజైః = ప్రకృతి వల్ల జన్మించిన; గుణైః = గుణాల ద్వారా; అవశః = వివశుడై; కర్మ = కర్మాచరణకు; కార్యతే = బాధ్యత వహిస్తోంది.

**తాత్పర్యం :** *" నిస్సందేహంగా ఏ మానవుడైనా కూడా ఎలాంటి సమయంలో నైనా కర్మ చేయకుండా క్షణకాలం అయినా వుండలేదు ! ఎంచేతంటే ప్రకృతి వల్ల జన్మించబడిన గుణాలకు లోబడే మానవ సముదాయం అంతా కర్మాచరణకు ఉపక్రమిస్తున్నది."*

**వ్యాఖ్యానం :**

మనిషి కర్మసంజాతుడు - కర్మలలోంచి పుట్టినవాడు ! మనిషి కర్మపూర్ణుడు- అంటే కర్మలను చేస్తూనే వుంటాడు ! మనిషి ఎప్పటికీ కర్మశూన్యుడు కాజాలడు- ' కర్మ శూన్య స్థితి ' అన్నది అసంభవం !
మనిషి కర్మలకు వివశుడు- అంటే కర్మలకు వశం అయినవాడు !
మనిషి ప్రకృతిలో ఒకానొక భాగం !
ప్రకృతి ఒక మహా కర్మసముద్రం !
ప్రతి ప్రత్యేక మనిషీ ఆ మహాసముద్రంలో ఓ ' అల ' మాత్రమే !
ఒకానొక ' అల ' ! ఒకానొక ' అలజడి ' !
జీవాత్మల కర్మలే ప్రకృతి ! కర్మ సముచ్చయాలే ప్రకృతి !
ప్రకృతి నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది ! అది ఎక్కడా ఆగదు !
నిరంతర బాహ్యకర్మల సముద్రంలో జీవాత్మల అంతర్ గుణాలు అత్యంత మెల్లమెల్లగా మారుతూ వుంటాయి !
బహిర్ కర్మలకు మూలం నిర్దిష్టమైన అంతర్ గుణాలు !
అంతర్ గుణాలకు మూలం అనంతమైన బహిర్ కర్మలు !
ఇదీ పరిస్థితి !

కర్మేంద్రియాణి సంయమ్య య అస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మథ్యా చారఃస ఉచ్యతే ॥ (3-6)

పదచ్ఛేదం : కర్మేంద్రియాణి, సంయమ్య, యఃఆస్తే, మనసా, స్మరన్, ఇంద్రియార్థాన్, విమూఢత్మా, విథ్యాచారః, సః, ఉచ్యతే.

టీకా : యః = ఎవరు; విమూఢాత్మా = మూఢబుద్ధి కలవాడు; కర్మేంద్రియాణి = అన్ని కర్మేంద్రియాల్ని; సంయమ్య = నిరోధించి; మనసా = మానసికంగా; ఇంద్రియార్థాన్ = ఇంద్రియ విషయాలను; స్మరన్ = స్మరిస్తూ; ఆస్తే = ఉంటాడో; సః = అలాంటివాడు; మిథ్యాచార = 'మిథ్యాచారి' అంటే 'దంభి' దంబాచారి; ఉచ్యతే = పిలువబడుతున్నాడు.

తాత్పర్యం : " **మూఢబుద్ధి గల ఏ వ్యక్తి ఇంద్రియాలన్నింటినీ బలవంతంగా నిరోధించి, మనస్సులో సదా వాటినే స్మరిస్తూ వుంటాడో అతడే ' మిథ్యాచారి ' అంటే ' ధంబాచారి ' అనబడతాడు.** "

వ్యాఖ్యానం :

బహిరేంద్రియ నిగ్రహాన్ని ' దమం ' అంటాం.

ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించడమే ' దమం ' !

అప్పుడు కోరికలు మనస్సులో విజృంభిస్తూ వుంటాయి.

మనస్సు అల్లకల్లోలం అవుతోంది.

అలాంటి మానవుడు మూఢబుద్ధి కలవాడు.

మనస్సుని ఎలాంటి పరిస్థితులలోనూ, అల్లకల్లోల పరచుకోకూడదు.

' బలవంతపు బ్రాహ్మణార్థం ' అన్నది ఎప్పుడూ పనికిరాదు !

' పట్టు-విడుపు ' వుండాలి ! సహజంగా బ్రతకాలి !

' బహిర్ దమం ' కాకుండా ' అంతర్ సమము ' అలవరచుకోవాలి.

' దమము ' అంటే ' బహిరేంద్రియ నిగ్రహం '.

' సమము ' అంటే ' అంతరేంద్రియ నిగ్రహం ! '

మనస్సే అంతరేంద్రియం.

అంతరేంద్రియం ధ్యాన, జ్ఞానాదుల వల్లనే శాంతం అవుతుంది.

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేర్జున ।
కర్మేంద్రియైః కర్మయోగ మసక్తః స విశిష్యతే ॥ (2-7)

పదచ్ఛేదం : యఃతు, ఇంద్రియాణి, మనసా, నియమ్య, ఆరభతే, అర్జున, కర్మేంద్రియైః, కర్మయోగమ్, అసక్తః, సః;, విశిష్యతే.

టీకా : తు = అయితే; అర్జున = ఓ అర్జునా; యః = ఎవరైతే; మనసా = మనస్సుతో; ఇంద్రియాణి = ఇంద్రియాలను; నియమ్య = వశం చేసుకుని; అసక్తః = అనాసక్తుడై; కర్మేంద్రియైః = ఇంద్రియాల ద్వారా; కర్మయోగమ్ = కర్మయోగాన్ని; ఆరభతే = ఆచరిస్తున్నాడో; సః = అలాంటి వాడే; విశిష్యతే = ఉత్తముడు.

తాత్పర్యం : **" అయితే, ఓ అర్జునా ! ఎవరు మనస్సులో మాత్రమే ఇంద్రియాలను వశపరుచుకుని అనాసక్తుడై అన్ని ఇంద్రియాల ద్వారా కర్మయోగాన్ని ఆచరిస్తున్నాడో అతడే ఉత్తముడు."**

వ్యాఖ్యానం :

ఉత్తములు ' ఎలా ' వ్యవహారం చేస్తారు ?

' ఎలా ' ? అంటే,

వారు బహిర్ దమము ఆచరించరు !

వారు అంతర్ సమము కోరుకుంటారు !

బహిర్ ఇంద్రియాలను 'మనస్సులో మాత్రమే' స్వాధీనపరచుకుంటారు !

బహిర్ దమానికి వారు ప్రాముఖ్యత ఇవ్వరు !

' బయట ఏమైనా సరే – లోపల ఏమీ కాకూడదు' అని తెలుసుకున్నవారు !

బయట ఎలాంటి కర్మలు ఆచరించినా వాటి ప్రభావం వారి లోపల వుండదు.

బయట ఏ మాత్రం నిగ్రహాన్ని పాటించని వారు వాళ్ళు

అయినా లోపల మహా నిగ్రహాన్ని పొందినవారు !

ఇదే నిజమైన కర్మయోగం !

బయట ప్రకృతి సహజసిద్ధమైన కర్మాచరణ !

లోపల సంపూర్ణమైన కర్మ శూన్యత !

నియతం కురు కర్మత్వం కర్మజ్యా యోహ్యకర్మణః ।
శరీర యాత్రాపి చ తేన ప్రసిద్ధ్యేదకర్మణః ॥ (2-72)

పదచ్ఛేదం : నియతమ్, కురు, కర్మ, త్వమ్ కర్మ, జానయః, హి, అకర్మణః, శరీర యాత్ర, అపి, చ, తే, న, ప్రసిద్ధ్వేత్, అకర్మణః.

టీకా : త్వమ్ = నువ్వు; నియతమ్ = శాస్త్రవిహితమైన; కర్మ = కర్తవ్య కర్మలను; కురు = చెయ్యి; హి = ఎంచేతనంటే; అకర్మణః = కర్మ చేయకుండా వుండడం కన్నా; కర్మ, జ్యాయః = కర్మ చేయడమే శ్రేష్ఠం; చ = మరి; అకర్మణః= కర్మచేయకపోతే; శరీర యాత్ర = నీ శరీర యాత్ర; అపి = కూడా; ప్రసిద్ధ్వేత్ = సిద్ధించదు.

తాత్పర్యం : **" నువ్వు శాస్త్ర విహితమైన కర్తవ్య కర్మలను ఆచరించు: కర్మలు చేయకుండా వుండడం కన్నా, కర్మలు, చేయడమే ఉత్తమం: కర్మలు చేయకపోతే నీ శరీర యాత్ర కూడా సిద్ధించదు."**

వ్యాఖ్యానం :

' తక్కువ కర్మలు చేయడం ' కన్నా ' ఎక్కువ కర్మలు చేయడం ' అన్నది ఉత్తమం.

' ఎక్కువ కర్మలు చేయడం ' కన్నా ' ఇంకా ఎక్కువ కర్మలు ' చేయడం అన్నది ఉత్తమోత్తమం.

నిజానికి కర్మలు చేయకపోతే భౌతిక కాయం కూడా నిలవదు.

అలా చేస్తే భౌతిక శరీరం చచ్చి ఊరుకుంటుంది.

ఎలాంటి కర్మలు చేయాలో తెలుసుకుని అలాంటి కర్మలే చెయ్యాలి.

శాస్త్ర సమ్మతమైన కర్మలే చెయ్యాలి.

కర్మలు చెయ్యడంలో సోమరితనం ఎప్పుడూ తగదు.ఖ

తమోగుణం ' కన్నా ' రజోగుణం ' వెయ్యిరెట్లు కాదు- లక్షరెట్లు గొప్పది !

**యజ్ఞార్థాత్కర్మణో న్యత్రలోకోయం కర్మబంధనః ।**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్త సంగః సమాచార ॥ (3-9)**

**పదచ్ఛేదం :** యజ్ఞార్థాత్, కర్మణః, అన్యత్ర, లోకః, అయమ్, కర్మ బంధనః, తథర్థమ్, కర్మ, కౌంతేయ, ముక్తసంగః, సమాచార.

**టీకా :** యజ్ఞార్థాత్ = యజ్ఞం కోసం చేసే; కర్మణః = కర్మలే కాకుండా; అన్యత్ర = యితరాలైన కర్మల్లో; అయమ్ = ఈలోకం; కర్మబంధనః = కర్మలచే బంధింపబడి వుంటుంది; కౌంతేయ = ఓ అర్జునా ! నువ్వు; ముక్తసంగః = ఎలాంటి అపేక్ష, ఆసక్తి లేని వాడవై; తదర్థమ్ = ఆ యజ్ఞం కోసం; కర్మ = నీ కర్తవ్య కర్మలను ; సమాచార = ఆచరించు.

**తాత్పర్యం :** **" ' యజ్ఞం ' కోసం చేసే కర్మలు తప్ప, ఇతరాలైన కర్మలలో ఆసక్తి గల ఈలోకం కర్మలచే బంధింపబడి వుంటుంది. కనుక, ఓ అర్జునా ! నువ్వు ఆసక్తిలేనివాడవై ' యజ్ఞం ' కోసం చక్కగా నీ కర్తవ్య కర్మల్ని ఆచరించు."**

**వాఖ్యానం :**

రెండు రకాల కర్మలున్నాయి

ఒకటి - మనకోసం మనం చేసుకునే కర్మలు.

రెండు - లోక కళ్యాణార్థం చేసే కర్మలు.

లోక కళ్యాణార్థం చేసే కర్మలను ' యజ్ఞం ' అంటాం.

కర్మ, ముఖ్యంగా వివేక రహితమైన కర్మ, బంధాన్ని కలిగిస్తుంది.

కానీ, ' యజ్ఞం ' ఎప్పుడూ బంధ విమోచనం కలిగిస్తుంది.

కృష్ణుడి ఆదేశం యజ్ఞాలను మాత్రమే చేపట్టమని.

స్వార్థ కర్మలను తీసేయమని.

స్వార్థ కర్మలు ఒకవేళ చేసినా పూర్తిగా వివేక సహితంగా ఉండాలి.

అంటే, కర్తవ్య కర్మలనే ఆచరించాలి.

అంటే, ధర్మయుత కర్మలనే చేపట్టాలి.

సహాయజ్ఞాః ప్రజాఃసృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేషవో స్త్విష్టకామధుక్ ॥ (3-10)

పదచ్ఛేదం : సహయజ్ఞాః, ప్రజాః, సృష్ట్వా, పురా, ఉవాచ, ప్రజాపతిః, అనేన, ప్రసవిష్యధ్వమ్, ఏషః, వః, అస్తు, ఇష్టకామధుక్...

టీకా : ప్రజాపతిః = బ్రహ్మ; పురా= కల్పారంభంలో, సహయజ్ఞా= యజ్ఞంతో కూడిన; ప్రజాః = ప్రజల్ని; సృష్ట్వా = సృష్టించి; ఉవాచ = చెప్పాడు; అనేన = ఈ యజ్ఞం ద్వారా; ప్రసవిష్యధ్వమ్ = అభివృద్ధిని పొందండి; ఏషః =ఈ యజ్ఞం; వః = మీకు; ఇష్టకామధుక్ = కోరుకున్న భోగాలు ప్రదానం చేసేదిగా; అస్తు = అవుతుంది.

తాత్పర్యం : " కల్పారంభంలో బ్రహ్మ ప్రజల్ని ' యజ్ఞ ' సహితంగా సృష్టించి వాళ్ళతో ' మీరూ యజ్ఞం ద్వారా పురోభివృద్ధిని పొందండి : ఇది మీరు కోరిన కోరికల్ని నెరవేరస్తుంది ' అని చెప్పాడు ! "

వ్యాఖ్యానం :

ప్రతి అంశాత్మా ఒకానొక పూర్ణాత్మ నుంచి ఉద్భవిస్తుంది !

ప్రతి పూర్ణాత్మా తన శక్తి అనుసారం అంశాత్మలను సృష్టిస్తూ ఉంటుంది !

మహాశక్తివంతమయిన పూర్ణాత్మలు జీవాత్మలను ' వర్షం ' లా కూడా కురిపిస్తూ ఉండవచ్చు.

అంశాత్మ ' ప్రజ ' అనబడుతుంది ! పూర్ణాత్మ ' ప్రజాపతి ' అనబడుతుంది !

సృష్టిలో కోటానుకోట్ల ప్రజాపతులున్నారు.

ప్రతి ప్రజాపతి ' ఒకానొక బ్రహ్మ ' - అంటే ' ఒకానొక సృష్టికర్త '.

తన కోసం సృష్టిచేయదు - ఏ ప్రజాపతి యైనా.

లోకకళ్యాణం కోసమే సృష్టి జరిగేది.

అంటే ప్రతి అంశాత్మ పుట్టుక ' కర్మ ' లోంచి జరగదు - ' యజ్ఞం ' లోంచి జరుగుతోంది !

జీవాత్మలకు పూర్ణాత్మలు ఇచ్చే సందేశం ఏమిటి ? –

" మీరు కూడా మాలాగే యజ్ఞాలు చేసి అభివృద్ధిని పొందండి !"

" కర్మలను చేస్తూ అభివృద్ధిని పొందకుండా ఉండవచ్చు ! "

" యజ్ఞాచరణ ద్వారానే కోరుకున్న భోగాలు సిద్ధిస్తాయి – కర్మాచరణ ద్వారా కాదు " – అని యజ్ఞాచరణ తదనంతరం ఏది ఇతరుల ద్వారా మనకు అనాయాచితంగా లభిస్తుందో అదే మహా ప్రసాదం ! – ఆ ప్రసాదంతోనే జీవించాలి !

జీవించాలి ! జీవించాలి ! కేవలం ప్రసాదంతోనే !

దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భవయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥ (3-11)

పదచ్ఛేదం : దేవాన్, భావయత, అనేన, తే, దేవాః, భావయంతు, వః, పరస్పరమ్, భావయంతః, శ్రేయః, పరమ్, అవాప్స్యథ

టీకా : అనేన = ఈ యజ్ఞం ద్వారా; దేవాన్= దేవతల్ని; భావయత= ఉన్నతులుగా చేసే; తే, దేవాః = ఆ దేవతలు; వః = మిమ్మల్ని; భావయంతు = ఉన్నతుల్ని చేస్తారు; పరస్పరమ్ = ఒకరినొకరు; భావయంత = ఉన్నతులుగా తయారుచేస్తారు; పరమ్ = ఉత్కృష్టమైన; శ్రేయః = శ్రేయస్సును; అవాప్స్యథ = పొందుతారు.

**తాత్పర్యం : " మీరందరూ ఈ ' యజ్ఞం ' ద్వారా దేవతలను ఉన్నతులుగా చేస్తే, ఆ దేవతలు మిమ్మల్ని మరింత ఉన్నతులుగా తీర్చి దిద్దుతారు. ఈ ప్రకారంగా కొరికొకరు పరస్పరం మేలు చేసుకోవడం వల్ల ఉత్కృష్టమైన శ్రేయస్సును పొందుతారు."**

వ్యాఖ్యానం :

రెండు లోకాలు ఉన్నాయి !
దేవతల లోకం ! మానవుల లోకం !
దేవతల లోకం దివ్యచక్షువుకే కనబడుతుంది !
దివ్యలోకవాసులు మానవుల కర్మలను సదా గమనిస్తూ ఉంటారు !
మానవుల యజ్ఞ కార్యక్రమాలు దేవతలను సంతోషపరుస్తూ ఉంటాయి !
మానవుల స్వార్థపూరిత కర్మలే దేవతలను దుఃఖపెడుతూ ఉంటాయి !
సంతోషం ఎప్పుడూ ఉన్నతపరుస్తుంది.
దుఃఖం ఎప్పుడూ కృశింపచేస్తుంది.
ఎప్పుడైతే దేవతలు మరి మన యజ్ఞ కార్యక్రమాల ద్వారా సంతోషంగా వుంటారో అప్పుడు వారు మరింతగా మానవ లోకాలకు సహాయం చేస్తారు.
మానవుల ద్వారా దేవతలూ, దేవతల ద్వారా మానవులూ- ఈ విధంగా - వారు పరస్పరం ఒకరినొకరు ఉన్నత పరచుకుంటూ ఉంటారు - యజ్ఞాల ద్వారా.
యజ్ఞరహిత కర్మల ద్వారా రెండు లోకాలూ విడిపోయి ఉంటాయి.
యజ్ఞాల ద్వారానే రెండు లోకాలూ చేదోడు వాదోడుగా ఉంటాయి !

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తాన ప్రదాయైభ్యో యో భుంక్తేస్తేన ఏవ సః ॥ (3-12)

పదచ్ఛేదం : ఇష్టాన్, భోగాన్, హి, వః, దేవాః, దాస్యంతే, యజ్ఞ భావితాః, తైః, దత్తాన్, అప్రదాయ, ఏభ్యః, యః, భుంక్తే, స్తేనః, ఏవ, సః.

టీకా : యజ్ఞభావితాః= యజ్ఞం ద్వారా 'ఉన్నతులైన; దేవాః = దేవతలు; వః = మీకు; ఇష్టాన్ = అభీష్టమైన; భోగాన్ = భోగాల్ని; హి = నిశ్చయంగా; దాస్యంతే = ఇస్తారు ఏ; తైః = ఆ దేవతల ద్వారా; దత్తాన్ = ఇవ్వబడిన భోగాలను; యః = ఏ పురుషుడు; ఏభ్యః=ఎవ్వరికీ; అప్రదాయ= ఇవ్వకుండానే; భుంక్తే = అనుభవిస్తాడో; సః= అలాంటివాడు; స్తేనః= దొంగ; ఏవ = అవుతున్నాడు.

తాత్పర్యం : " ' యజ్ఞం ' ద్వారా ఉన్నతులైన దేవతలు మీ అభీష్టమైన భోగాల్ని నిశ్చయంగా మీరు అడక్కుండానే ఇస్తారు. ఆ విధంగా దేవతల ద్వారా పొందిన భోగాలను ఏ పురుషుడు ఇతరులెవ్వరికీ ఇవ్వకుండానే తానే అనుభవిస్తాడో అలాంటి వాడు 'దొంగ' అవుతున్నాడు."

వ్యాఖ్యానం :

యజ్ఞాల ద్వారా దేవతలు – ఆస్ట్రల్ మాస్టర్లు – సంతుష్టులవుతారు.

యజ్ఞాల ద్వారా సంతుష్టులైన దేవతలు అడక్కుండానే ప్రసాదం పెడ్తారు.

' ప్రసాదం ఇవ్వండి ' అని వేరే అడగనక్కర లేదు.

నిజానికి స్వంతానికి కావలసినదానికన్నా ఎక్కువే పెడతారు.

అయితే దాన్ని మళ్ళీ మనం అందరితో పంచుకోవాలి ;

మనమే పూర్తిగా ' స్వాహా ' చేయకూడదు !

అలా చేస్తే ' దొంగ ' అని తప్పక అభివర్ణించబడతాం.

ఎప్పటికప్పుడు మన దగ్గర ఉన్నది అప్పటికప్పుడే అందరిదీ !

అదీ సృష్టి యొక్క మూల యజ్ఞ సూత్రం !

**యజ్ఞ శిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।**

**భుఞ్జతే తే త్వఘం పాపా యే పంచ త్యాత్మకారణాత్ ॥ (3-11)**

పదచ్ఛేదం : యజ్ఞ శిష్టాశినః, సంతః, ముచ్యంతే, సర్వకిల్బిషైః, భుఞ్జతే, తే, తు, అఘమ్, పాపాః, యే, పంచతి, ఆత్మకారణాత్.

టీకా : యజ్ఞ శిష్టాశినః = యజ్ఞంలో ' మిగిలిన దానిని ' తినే; సంతః = సజ్జనులు; సర్వకిల్బిషైః= సమస్త పాపాల నుంచి; ముచ్యంతే = విముక్తులు అవుతారు; యే = ఎవరైతే; పాపాః= పాపులు; ఆత్మకారణాత్ = తమ శరీర పోషణ నిమిత్తం; పంచన్తి = వండుకుంటున్నారో; తే= వాళ్ళు; తు= అయితే; అఘమ్ = పాపాన్ని; భుఞ్జతే= తింటున్నారు.

తాత్పర్యం : **" ' యజ్ఞంలో మిగిలిన దానిని తినే సజ్జనులు సమస్త పాపాల నుంచి విముక్తులు అవుతారు: అయితే, ఏ పాపులు తమ స్వంత శరీర పోషణ నిమిత్తమే అన్నం వండుకుంటున్నారో వారు పాపాన్నే తింటున్నారు."**

వ్యాఖ్యానం :

' యజ్ఞావశిష్టం ' అంటే ఇతరులకు మనం చేయడం

ద్వారా వారు సంతృప్తితో మనకు యిచ్చింది అని అర్థం !

దీనినే ' ప్రసాదం ' అని కూడా అంటాం.

' ప్రసాదం' తో మాత్రమే జీవించేవారు తప్పక విముక్తులు అవుతారు.

అలా కాకుండా తమ కోసం తాము చేసుకునే వంట - అది ' పాపపు కూడు '.

ముక్తికి మార్గం ఏది ? యజ్ఞమే ముక్తికి మార్గం.

' పునరపి జననం పునరపి మరణం ' - దీనికి కారణం ఏది ?

తాము విడిగా వండుకుని తాము విడిగా భోంచేయడమే - దీనికి కారణం !

' విడి ' గా ఉండరాదు; ' కలివిడి ' గా ఉండాలి.

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః ।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥
కర్మబ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ **(3-14-15)**

పదచ్ఛేదం : అన్నాత్, భవంతి, భూతాని, పర్జన్యాత్, అన్నసంభవః, యజ్ఞాత్, భవతి, పర్జన్యః, యజ్ఞః ; కర్మ, సముద్భవః, కర్మ, బ్రహ్మోద్భవమ్, విద్ధి, బ్రహ్మ, అక్షర సముద్భవమ్, తస్మాత్, సర్వగతమ్, బ్రహ్మ, నిత్యమ్, యజ్ఞే, ప్రతిష్ఠితమ్.

టీకా : భూతాని = సమస్త ప్రాణులు; అన్నాత్ = అన్నం వల్ల; భవంతి = కల్గుతున్నాయి; అన్నసంభవః= అన్నం యొక్క ఉత్పత్తి; పర్జన్యాత్ = వృష్టి వల్ల; పర్జన్యం = వృష్టి; యజ్ఞాత్ = యజ్ఞం వల్ల; భవతి = పుడుతోంది; యజ్ఞః = యజ్ఞం; కర్మసముద్భవః = విహిత కర్మ వల్ల; కర్మ = కర్మసముదాయం; బ్రహ్మోద్భవమ్ = వేదాల నుంచి పుడుతోంది; బ్రహ్మః = వేదం; అక్షరసబుద్భవమ్ = నాశరహితుడైన పరమాత్మ నుండి పుడుతోందని; విద్ధి = తెలుసుకో; తస్మాత్ = అంచేత; సర్వగతమ్ = సర్వత్రావ్యాపించి వున్న; బ్రహ్మ = బ్రహ్మ; నిత్యమ్ = ఎల్లప్పుడూ; యజ్ఞే = యజ్ఞంలో; ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠతుడని తెలుసుంది.

తాత్పర్యం : " సమస్త ప్రాణులూ ' అన్నం ' నుంచి పుడ్తున్నాయి : అన్నోత్పత్తి ' వృష్టి ' వల్ల కలుగుతోంది ! ' వృష్టి ' ' యజ్ఞం ' వల్ల కలుగుతుంది. ' యజ్ఞం ' సత్కర్మద్వారా ఉత్పన్నం అవుతోంది. ఆ ' సత్కర్మ సముదాయం ' ' వేదం' వల్ల పుడుతోంది. ' వేదం ' అక్షరపరబ్రహ్మ నుంచి పుడుతోంది. దీనిని బట్టి సర్వవ్యాప్తమైన 'అక్షర పరబ్రహ్మ ' ఎల్లప్పుడూ ' యజ్ఞం ' ద్వారానే ప్రతిష్ఠితుడవుతున్నాడని తెలుస్తోంది."

వ్యాఖ్యానం :

' అన్నం ' అంటే ' ఉడికించిన బియ్యం ' కాదు !

భౌతిక శరీరాన్ని ' అన్నమయ కోశం ' అంటాం !

అంటే – ' ఆటమ్స్, మాలిక్యూల్స్‌తో కూడిన ' అంటే– ' అణు, పరమాణు సముదాయంతో కూడిన ' అని !

' అన్నత్పత్తి వృష్టి వల్ల ' అన్నప్పుడు ' మేటర్ ' అన్నది ' ఎనర్జీ వల్ల ' అని అర్థం!

ఇక్కడ చెప్పబడిన వృష్టి ' దివ్యచక్షువుతో చూడబడిన వృష్టి ' అంటే – ' ఆకాశ గంగ ', అంటే – ' కాస్మిక్ ఎనర్జీ ' అన్నమాట !

ప్రాణ శక్తి + దేహం = ప్రాణి ' అథవా ' దేహి !

' శక్తి ' అన్నది ' నిస్వార్థ కర్మ ' వల్లనే ఉద్భవిస్తుంది !

నిస్వార్థ కర్మనే ' సత్ కర్మ ' అని కూడా అంటాం !

' సత్ కర్మ ' ఎక్కడనుంచి పుడుతుంది ?

సత్ కర్మ ' జ్ఞాన ' సముద్భవం !

అది జ్ఞానం ద్వారానే, జ్ఞానం ఉంటేనే, పుడుతుంది !

' జ్ఞానం ' అన్న దానిని పురాతన హిందూ వాఙ్మయంలో ' వేదం ' అని అన్నారు!

వేదం ఎక్కడనుంచి పుడుతుంది ?

మూలచైతన్యం యొక్క పరీక్ష నుంచి పుడుతుంది !

మూల చైతన్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు పుడుతుంది !

మూల చైతన్యమే ' బ్రహ్మ ', ' అక్షరబ్రహ్మ ' !

' బ్రహ్మ ' అంటే ' అంతటా వ్యాపించియున్న ' !

' అక్షర ' అంటే ' ఎప్పటికీ నశించని ' అని !

అవ్యక్తమైన అక్షర పరబ్రహ్మ ' యజ్ఞం ' ద్వారానే వ్యక్తం అవుతుంది !

– ప్రతిష్ఠితమవుతుంది !

' ప్రతిష్ఠితం ' అంటే ' పునః పునః విశ్లేషింపబడడం !'

కనుక ' అన్నం ' అంటే ' ఉడికిన బియ్యం ' కాదు !

' వృష్టి ' అంటే ' చర్మచక్షువు ' తో చూసే నీటి వర్షం కాదు !

దివ్యచక్షువుతో చూస్తే తప్ప భగవద్గీతలో ఒక్క ముక్క ఒక్క వ్యాక్యం అన్నా అర్థం కావడం దుర్లభం, అసంభవం.

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహయః ।**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థసజీవతి ॥ (3-16)**

**పదచ్ఛేదం :** ఏవమ్, ప్రవర్తితమ్, చక్రమ్, న, అనువర్తియతి, ఇహ, యః, అఘాయుః, ఇంద్రియారామః, మోఘమ్, పార్థ, న, జీవతిః.

**టీకా :** పార్థ = అర్జునా; యః = ఎవరు; ఇహ = ఈ లోకంలో; ఏవమ్ = ఈ విధంగా; ప్రవర్తితమ్ = నడుస్తున్న; చక్రమ్= సృష్టిచక్రానికి; వ అనువర్తిమ= అనుగుణంగా నడవడో; సః= అతడు; ఇంద్రియారామః= ఇంద్రియాలోలుడై; అగాయః = పాపజీవితాన్ని; మోఘమ్ = వ్యర్థంగా; జీవతి = జీవిస్తున్నాడు.

**తాత్పర్యం :** **" అర్జునా ! ఈ లోకంలో ఈ విధమైన సృష్టిచక్రానికి అనుగుణంగా ఎవడు నడవడో, అతడు ఇంద్రియాలకు లోనై పాపపు జీవితాన్ని గడుపుతూ వ్యర్థంగా జీవిస్తున్నాడు ."**

**వ్యాఖ్యానం :**

నాలుగు క్షేత్రాలు ఉన్నాయి !
ఒకటి - భౌతిక క్షేత్రం.
రెండు - ప్రాణక్షేత్రం.
మూడు - భావనా క్షేత్రం.
నాలుగు - ఆత్మక్షేత్రం.
భౌతిక క్షేత్రానికి మూలం ప్రాణక్షేత్రం !
ప్రాణ క్షేత్రానికి మూలం భావనా క్షేత్రం !
భావనా క్షేత్రానికి మూలం ఆత్మక్షేత్రం !
ఈ ' సృష్టిక్రమం ' తెలిసిన వాళ్ళే ఆ క్రమంలో సరిగ్గా జీవిస్తారు !
ఈ సృష్టిక్రమం తెలియని వారు ఇంద్రియాలకు వశులవుతున్నారు.
ఇంద్రియాలకు వశులై పాపపు జీవితం గడుపుతున్నారు ! -
పాపచరితులై వ్యర్థంగా కాలం గడుపుతున్నారు !
సృష్టిచక్రం యొక్క మూల క్రమం తెలుసుకున్న వాళ్ళుతదనుగుణంగానే నడుచుకుంటారు !
ఆ విధంగా పుణ్యచరితులవుతున్నారు !-
పుణ్యచరితులై అర్థపు జీవితాన్ని గడుపుతున్నారు !

యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే ॥ (3-17)

పదచ్ఛేదం : యః, తు, త్మరతిః, ఏవ, స్యాత్, ఆత్మతృప్తః, చ, మానవః, ఆత్మని, ఏవ, చ, సంతుష్టః, తస్య, కార్యమ్, న, విద్యతే.

టీకా : తు= కానీ; యః=ఏ; మానవః=మానవుడు; ఆత్మరతిః ఏవ= ఆత్మలోనే రమిస్తూ; చ= మరి; ఆత్మతృప్తః= ఆత్మలోనే తృప్తిపొందుతూ; చ= మరి; ఆత్మని ఏవ = ఆత్మలోనే; సంతుష్ట= సంతోషిస్తూ; స్యాత్ = వుంటాడో; తస్య = వానికి; కార్యమ్ = చేయవలసిన కర్తవ్యం; న విద్యతే = ఏదీ వుండదు.

తాత్పర్యం : **" ఏ మానవుడు ఆత్మలోనే క్రీడిస్తూ, ఆత్మలోనే తృప్తి పొందుతూ, ఆత్మలోనే సంతోషపడుతూంటాడో అలాంటి ఆత్మజ్ఞానికి ఇంక చేయవలసిన కర్తవ్యం ఏదీ వుండదు."**

వ్యాఖ్యానం :

నాలుగు క్షేత్రాలు !

నాలుగు క్షేత్రాలలో ప్రథమ, మౌలికక్షేత్రం – ఆత్మక్షేత్రం !
ఆత్మ క్షేత్రంలోనే సదా క్రీడిస్తూ వుండాలి !
ఆత్మక్షేత్రంలో సదా తృప్తిపొందుతూ వుండాలి !
ఆత్మక్షేత్రంలోనే సదా సంతోష పడుతూ వుండాలి !
ఇలాంటి వాళ్ళనే ' ఆత్మ జ్ఞానులు ' అంటాం !
అలా వుంటున్న వాళ్ళకి వేరే చేయవలసిన కార్యం అంటూ ఏదీ ఉండదు !
అలా కాకుండా కేవలం భౌతికక్షేత్రంలో తృప్తిపొందాలని
చూసేవారు ఎప్పుడూ తృప్తిని పొందలేరు !
భౌతికక్షేత్రంలోనే సంతోషం పొందాలనుకునేవారు ఎప్పుడూ
శాశ్వత సంతోషాన్ని పొందలేరు !
శంకరాచార్యుల వారు కూడా అన్నారు కదా !
" యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందతి ఏవః " అని !
" ఎవరైతే ఎప్పుడూ ఆత్మక్షేత్రంలోనే క్రీడిస్తూ వుంటారో వారికే
ఆనందం ! ఆనందం ! ఆనందం ! అని

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ (3-21)

పదచ్ఛేదం : యత్, యత్ ఆచరతి, శ్రేష్ఠః, తత్, తత్, ఏవ, ఇతరః, జనః, సః, యత్, ప్రమాణమ్, కురుతే, లోకః, తత్ అనువర్తతే.

టీకా : శ్రేష్ఠః = ఉత్తముడు; యత్, యత్ = ఏ ఏ విధంగా; ఆచరతి = ఆచరిస్తాడో; ఇతరః = ఇతరులు; జనః = జనులు; తత్ తత్ = అదేవిధంగా; ఏవ = మాత్రమే; సః = అతడు; యత్ = దేనిని; ప్రమాణమ్ = ప్రమాణంగా; కురుతే = చేస్తున్నాడో; లోకః = సమస్తలోకం; తత్ = దానినే; అనువర్తతే = అనుసరిస్తోంది.

తాత్పర్యం : **" ఉత్తములు దేనిని ఆచరిస్తారో అన్యులు కూడా దానినే ఆచరిస్తారు : ఉత్తముడు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తాడో దానినే సమస్త లోకం అనుసరిస్తుంది."**

వ్యాఖ్యానం :

ఉత్తములు మార్గం చూపేవారు !
అన్యులు, అనుత్తములు, ఉత్తములు చూపే మార్గంలో నడిచేవారు !
ఉత్తములు దేనికి ప్రాధాన్యతనిస్తారో సమస్త లోకం దానికే ప్రాధాన్యతనిస్తుంది !
ఉత్తములు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తారో లోకమంతా దానినే ప్రమాణంగా స్వీకరిస్తుంది.
ఉత్తములు అజాగ్రత్తగా ఉంటే లోకమంతా అజాగ్రత్తలో పడిపోతుంది !
అలా జరిగితే దానికి కారణం ఆ ఉత్తములే అవుతారు !
లోకం అజాగ్రత్తలో పడినప్పుడు ఆ గురువు ఉత్తముడు కాదన్నమాట !
కనుక, ఉత్తములు అత్యంత జాగరూకులుగా ఉండాలి !
అత్యంత జాగరూకులుగా ఉన్నప్పుడే ఉత్తములవుతారు !
తమకి ఇంకా జాగ్రత్త అలవడలేదని తెలుసుకున్నవారు– నడిపించడానికి సిద్ధపడకూడదు !
ఇంకా నేర్చుకోవడానికే సిద్ధపడాలి ; నడపబడడానికే సిద్ధపడాలి !
ఎంతో శ్రద్ధతో నడక నేర్చుకోవాలి ! ఆ తర్వాతే నేర్పించ ఉపక్రమించాలి !
దేనిలో ఎవరికి నిష్ణాత ఉందో దానిని మాత్రమే వారు ఇతరులకు నేర్పించపూనాలి!

నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నా నవాప్తమవాప్తవ్యం వర్తఏవ చ కర్మణి ॥ (3-22)

పదచ్ఛేదం : న, మే, పార్థ, అస్తి, కర్తవ్యమ్, త్రిషు, లోకేషు, కించన, అవాప్తవ్యమ్, వర్తే, ఏవ, చ కర్మణి.

టీకా : పార్థా = అర్జునా !; మే = నాకు; త్రిషు = మూడు; లోకేషు = లోకాలలో; కించన = ఏ కొంచెం కూడా; కర్తవ్యమ్ = చేయవలసింది; న అస్తి = లేదు; చ = మరి; అవాప్తవ్యమ్ = పొందదగిన; అనవాప్తమ్ = పొందలేనిది; న = లేదు; కర్మణి= కర్మచేయడానికి, ఏవ = లోనై; వర్తే = నిమగ్నమై వున్నాను.

**తాత్పర్యం : " అర్జునా ! నాకు ఈ మూడు లోకాల లోనూ చేయవలసిన పని అంటూ ఏదీ లేదు : మరి పొందదగినదీ, పొందలేనిదీ అంటూ ఏమీ లేదు. అయినా నేను కర్మచేయడంలో నిమగ్నమై వున్నాను."**

వ్యాఖ్యానం :

" ఓ అర్జునా ! "

" నా గురించి చెప్తాను విను " - అంటున్నాడు కృష్ణుడు.

త్రి లోకేషు అంటే - " మూడు లోకాలు !"

ఏ మూడు లోకాలు ?

' భూ ', ' భువర్ ', ' సువర్ ' లోకాలు !

అథవా ' అధో ' లోకాలు !

" ఈ లోకాలలో నేను ఏయవలసింది ఏదీ లేదు " అన్నాడాయన !

" ఈ లోకాలలో చేయవలసింది ఎప్పుడో పూర్తి అయిపోయిందన్నమాట !"

" ఇలాంటి పరిస్థితులలో కూడా నేను ఈ లోకాలలో పనులు చేస్తూనే వున్నాను" అన్నాడు కూడా ఆయన

' కృష్ణ ' అంటే ' కృ + అష్ణన్ '

' కృ ' అంటే ' చేయవలసినవి '.

' అష్ణన్ ' అంటే ' భుజించడం '.

" చేయవలసిందంతా చేసి వాటి ఫలితాల్ని భుజిస్తున్నవాడి " నే ' కృష్ణుడు ' అని అంటారు !

**యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ (3-23)**

**పదచ్ఛేదం :** యది, హి, అహమ్, న, వర్తేయమ్, జాతు, కర్మణి, అతంద్రితః, మమ, వర్త్మ, అనువర్తంతే, మనుష్యాః, పార్థ, సర్వశః.

**టీకా :** హి= ఎంచేతంటే; పార్థ = అర్జునా; యది = ఒకవేళ; జాతు = ఎప్పుడైనా; అహమ్ = నేను; అతంద్రితః జాగురూకుడనై; కర్మణి = కర్మలలో; న వర్తేయం = ప్రవర్తించకపోతే; మనుష్యాః = మానవులు; సర్వశః = అన్ని రకాల; మమ= నా యొక్క; వర్త్మ= మార్గాన్ని; అనువర్తంతే = అనుసరిస్తారు.

**తాత్పర్యం :** **" అర్జునా ! ఒకవేళ ఎప్పుడైనా నేను జాగురూకుడనై కర్మలలో ప్రవర్తించకపోతే, మానవులు అన్ని విధాలా నా యొక్క మార్గాన్నే అనుసరిస్తారు. "**

**వ్యాఖ్యానం :**

ఇంకా కృష్ణుడు అంటున్నాడు -

" నేను అజాగరుకుడనైతే అందరూ ఆ అజాగ్రత్తలోనే పడిపోతారు " కానీ,

" నేను ఎప్పుడూ జాగ్రత్తతోనే ప్రవర్తించాను ! "

" నేను ఎప్పుడూ సరిగ్గానే వ్యవహరించాను ! "

" నేను ఎప్పుడూ జాగ్రత్తతోనే ప్రవర్తించాను ! "

ఎంచేతంటే, " ఇతరులు నన్ను ' గురువు ' గా స్వీకరించారు " కనుక

" ఇతరులకు ' గురువు ' గా వుండడానికి నేను ఇష్టపడ్డాను " కనుక.

" ' గురువు ' అన్న బాధ్యత తీసుకున్నప్పుడు సరిగ్గా వుండాలి ! "

" తనకు నచ్చినట్లుగానే చేసే విధం వున్నప్పుడు ' గురువు బాధ్యత ' స్వీకరించకూడదు ! "

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥ (3-27)**

**పదచ్ఛేదం :** ప్రకృతేః, క్రియమాణాని, గుణైః, కర్మాణి, సర్వశః, అహంకార విమూఢాత్మా, కర్తా, అహమ్, ఇతి, మన్యతే.

**టీకా :** కర్మాణి = సకల కర్మలలో; సర్వశః= అన్ని విధాలా; ప్రకృతే = ప్రకృతి యొక్క; గుణేః= గుణాల ద్వారా; క్రియమాణాని = చేయబడుతున్న; కర్మణి= కర్మలను; అహంకార విమూఢాత్మా = అహంకారంతో వివేకశూన్యమైన మనస్సు వున్నవాడు; అహమ్ కర్తా = నేనే చేస్తున్నాను; ఇతి = అని; మన్యతే = భావిస్తాడు.

**తాత్పర్యం :** **" సకల కర్మలు అని విధాలుగా ప్రకృతి గుణాల ద్వారానే జరుగుతున్నాయి : అయినా, అహంకారంతో వివేకశూన్యమైన మనస్సు గలవాడు 'అన్నీ నేనే చేస్తున్నా ' నని అనుకుంటాడు. "**

**వ్యాఖ్యానం :**

రెండు వున్నాయి !

**1. బహిర్ కార్యకలాపాలు ! 2. అంతర్ గుణాలు !**

బహిర్ కార్యకలాపాలు అంతర్ గుణాల ఛాయలు మాత్రమే !

మనిషి ఎటు నడిస్తే అతని ఛాయ అటువైపు నడుస్తుంది !

మనిషి యొక్క ' వర్తమాన గుణం ' అన్నది అనేక జన్మకర్మల ఫలితం !

ఎవరి గుణాన్ని వారు అకస్మాత్తుగా మార్చుకోవడం అసంభవం !

గుణం క్షణక్షణానికీ మారదు ! గుణం జన్మ జన్మకీ ' ఒక మిల్లీ మీటర్ ' చొప్పున మాత్రమే మారుతూంటుంది !

కనుక, కర్మలు నిందనీయం కావు ! మరి గుణాలు నిందనీయం కావు !

' నిందనీయం ' కాని వాటిలో మనం తాదాత్మ్య చెందడం ఎంతటి మూర్ఖత !

ప్రకృతితో భిన్నుడైన జీవుడు ప్రకృతితో తాదాత్మ్యం ఆరోపించినా, ఆరోపించకున్నా పరమ శోభితుడవుతున్నాడు !

' వాడు చేస్తున్నాడ ' ని కానీ, ' నేను చేస్తున్నా ' నని కానీ భావిస్తే – ఇది వివేకశూన్యత !

" ఇక్కడ ఈ గుణాలు ఈ విధంగా నాట్యం చేస్తున్నా " యని జ్ఞప్తికి ఉంచుకోవడమే వివేకం !

అంతా జరుగుతూనే ఉంది కానీ, ' చేసేవాడూ ', ' చేయించేవాడూ ' ఎవ్వడూలేడు!

మనిషి అవివేకాన్ని పోగొట్టుకోవాలి ! మహావివేకి కావాలి !

' నేను ' అన్న భావనే వివేక శూన్యత ! ' జరుగుతోంది ' అన్నదే " మహావివేకం " !

అహంకారమే మూఢత ! అహంకార సహితుడే అజ్ఞానాత్ముడు !

అహంకార రహితుడే ఆత్మజ్ఞానాత్ముడు !

ప్రకృతేర్గుణ సమ్మూఢాః సజ్జంతే గుణ కర్మసు ।
తానకృత్స్నవిదో మందాన్కృత్స్నవిన్నవిచాలయేత్ ॥ (3-23)

పదచ్ఛేదం : ప్రకృతేః, గుణసమ్మూఢా, సజ్జంతే, గుణకర్మసు, తాన్, అకృత్స్నవిదః, మందాన్, కృత్స్నవిత్, న, విచాలయేత్.

టీకా : ప్రకృతేః = ప్రకృతి యొక్క; గుణసమ్మూఢాః= గుణాల వల్ల మోహితులైనవారు; గుణకర్మసు = గుణాల లోనూ, కర్మలలోనూ; సజ్జంతే = ఆసక్తులైన; తాన్ = ఆ; అకృత్స్నవిదః = అల్పజ్ఞులు; మందాన్ = మందమతులైన; కృత్స్నవిత్ = ఆత్మజ్ఞానులైనవారు; విచాలయత్ = చలింపచేయకూడదు.

తాత్పర్యం : " ప్రకృతి యొక్క గుణాల వల్ల మోహితులైన వారు, గుణాలలోనూ, కర్మలలోనూ ఆసక్తులు అవుతారు : అటువంటి అల్పజ్ఞులను ఆత్మజ్ఞానులైన వారు చలింపచేయకూడదు. "

వ్యాఖ్యానం :

అల్పజ్ఞులు వేరే ! ఆత్మజ్ఞానులు వేరే !
ఆత్మజ్ఞానులు అల్పజ్ఞులు కాలేరు !
అల్పజ్ఞులు ఆత్మజ్ఞానులు కాలేరు !
తమోగుణుల కార్యకలాపాలు వేరే !
రజోగుణుల కార్యకలాపాలు వేరే !
సత్వగుణుల కార్యకలాపాలు వేరే !
నిర్గుణుల కార్యకలాపాలు వేరే !
కనుక, ఎవరి గుణానికి సంబంధించిన కార్యకలాపాలను వారితో చేయనివ్వాలి !-
వేటికీ అడ్డుపడరాదు !
ఎవరు ఏది చేస్తున్నా- ఎవరు ఏది చేయదలుచుకున్నా " యధేచ్ఛసి తథాకురు "
అనాలి !
అంటే " నీ ఇష్టం వచ్చినట్టు చేయి " అని !
అయితే, అడిగినప్పుడు మాత్రం " ఇలా చేస్తే అలా అవుతుంది !"
" అలా చేస్తే ఇలా అవుతుంది ! " అని మటుకు చెప్పాలి !

**శ్రేయస్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వ నుష్ఠితాత్ !**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయవహః ॥ (3-35)**

**పదచ్ఛేదం :** శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్, స్వధర్మే, నిదనమ్, శ్రేయః, పరధర్మః, భయావహః.

**టీకా :** స్వనుష్ఠితాత్ చక్కగా ఆచరింపబడిన; పరధర్మాత్ ఇతరుల ధర్మం కన్నా; విగుణం గుణరహితమైనప్పటికీ; స్వధర్మః = తన ధర్మం; శ్రేయాన్= అత్యుత్తమమైంది; స్వధర్మే= తన ధర్మంలో; నిదనమ్= చనిపోవడం; శ్రేయః= ఉత్తమమైంది; పరధర్మః= ఇతరుల ధర్మం; భయావహః = భయంకరమైనది.

**తాత్పర్యం :** ***" చక్కగా ఆచరించబడిన పరధర్మం కన్నా గుణరహితమైనప్పటికీ స్వధర్మమే అత్యుత్తమైనది. స్వధర్మా చరణంలో మరణం సంభవించినప్పటికీ అది శ్రేయస్కరమే: కానీ, పరధర్మం భయంకరమైనది."***

**వ్యాఖ్యానం :**

' స్వధర్మం ' అంటే ' ఎవరు ఏ ఆత్మ పరిణామ దశల్లో వున్నారో ఆ ఆత్మస్థాయికి తగ్గ గుణం ' అన్నమాట !

' పరధర్మం ' అంటే ' ఇతరులు ఏ ఆత్మ పరిణితి స్థాయిలో ఉన్నారో ఆ ఆత్మ పరిణితి స్థాయికి తగ్గ గుణం ' అన్నమాట !

' పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం ' సబబు కాదు !

పులి జీవితంలా ' నక్క జీవితం ' వుంటే నక్క నష్టపోతుంది !

' నక్క దశ ' లో వున్నప్పుడు నక్కలానే జీవించాలి !

స్వధర్మానికి వ్యతిరేకంగా ' ఓ నక్క ' జీవించడానికి యత్నిస్తే ఎన్నో నక్క జన్మలు తప్పవు !

తన స్వధర్మానికి అనుగుణంగానే ఓ నక్క జీవిస్తే ' ఒక్క నక్క జన్మ ' తోనే సరిపోతుంది !

గురువు ' చేసినట్లు ' చెయ్యొద్దు ! గురువు ' చెప్పినట్లు ' చెయ్యాలి !
కనుక, ఎవరి ధర్మాన్ని వాళ్ళు , అది విశిష్టగుణ రహితం అయినప్పటికీ,
' అల్పగుణి ' అయినప్పటికీ వాళ్ళు దానినే అనుసరించాలి !
' జయ విజయులు ' తమ అల్పగుణాన్ని భయరహితులై, సంకోచరహితులై
ఆశ్రయించి మూడు జన్మలలోనే కడతేరినట్లు పురాణగాథ వున్నది కదా !
వుండవలసింది భయరహితం ! సంకోచరహితం !
మరి సదా, సర్వత్రా స్వధర్మాశ్రయం !

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ (3-37)

పదచ్ఛేదం : కామః, ఏషః, క్రోధ, రజోగుణ సముద్భవః, మహాశనః, మహాపాప్మా, విద్ధి, ఏనమ్, ఇహ, వైరిణమ్.

టీకా : రజోగుణసముద్భవః= రజోగుణం వల్ల కలిగిన; ఏషః= ఈ; కామః = కామమే; క్రోధః= క్రోధం; ఏషః = ఇది; మహాశనః= తృప్తిచెందనీయదు; మహాపాప్మా= మహాపాపిష్టిది; ఏనమ్ = దానిని; ఇహ = ఈ సందర్భంలో; వైరిణమ్ = శత్రువుగా; విద్ధి = తెలుసుకో.

**తాత్పర్యం : " రజోగుణం వల్ల కలిగే కామమే క్రోధం. ఇది ఎంత మాత్రమూ తృప్తి చెందనివ్వదు. ఇది మహాపాపి : ఈ సందర్భంలో దీనిని ' శత్రువు ' అని తెలుసుకో. "**

**వ్యాఖ్యానం :**

అన్ని గుణాల్లోనూ రజోగుణం మహా పాపభూయిష్ఠమైనది ! రజో గుణి చిహ్నమే ' క్రోధం ' !

' క్రోధం ' అన్నదే ఆత్మకి ' పరమ శత్రువు ' !

మానవ జీవితాన్ని నాశనం చేసేదే క్రోధం ! క్రోధం వున్నవారు ఎప్పుడూ 'తృప్తి' చెందలేరు ! క్రోధాత్ములు అశాంతిమయులు !

అయితే, ఆత్మపరిణామక్రమంలో ఇది ఒకానొక ' తప్పనిసరి ' దశ !

ఆ దశను త్వరగా దాటేసేయాలి ! త్వర త్వరగా దాటేసేయాలి !

అక్కడ అనేక జన్మలను ' వృధా ' చేయరాదు !

రజోగుణ దశల్లో ఒక్క జన్మ వుండడం ' తప్పనిసరి ! ' ఎవ్వరికైనా గానీ-కానీ, అనేక జన్మలు వుండడం అన్నది ' తప్పే సరి ' యే !

ధూమేనా వ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ ।
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ ॥ (3-38)

పదచ్ఛేదం : ధూమేన, ఆవ్రియతే, వహ్నిః, యథా, ఆదర్శః, మలేన, చ, యథా, ఉల్బేన, ఆవృతః, గర్భం, తథా, తేన, ఇదమ్, ఆవృతమ్.

టీకా : యథా = ఏ విధంగా; ధూమేన = పొగలో; వహ్నిః= నిప్పు; చ = మరి; మలేన = ధూళిలో; ఆదర్శః= అద్దం; ఆవ్రియతే = కప్పబడి వుంటుందో; యథా = ఏ విధంగా; ఉల్బేన = మావి పొరలో; గర్భం = గర్భంలోని పిండం; ఆవృతః! = కప్పబడి వుంటుందో; తథా = అదే విధంగా, తేన = ఆ కామం ద్వారా; ఇదమ్ = ఈ జ్ఞానం; ఆవృతమ్= కప్పబడి వుంటుంది.

తాత్పర్యం : **" ' పొగ ' చేత నిప్పు, ' ధూళి ' చేత అద్దం, ' మావి ' చేత గర్భం లోని పిండం కప్పబడినట్లే ' కామం ' నేత ' జ్ఞానం ' కప్పబడి వుంటుంది."**

వ్యాఖ్యానం :

ఎంతటి తమోగుణీ అయినా, ఎంతటి రజోగుణీ అయినా ప్రతి ఒక్కరి యదార్థ స్వరూపం ' సత్త్వమే ' !

ప్రతి ఒక్కరి యదార్థ స్వరూపం ' పూర్ణ జ్ఞానమే ' !

ఆ బీజం లోంచే, ఆ క్షేత్రం లోంచే జీవులందరూ జన్మింపబడ్డారు కనుక !-

అయితే, ' మురికి ' చేత ' అద్దం ' కప్పబడి వుంది !

' నివురు ' చేత ' నిప్పు ' కప్పబడి వుంది !

' మావి ' చేత గర్భంలోని ' పిండం ' కప్పబడి వుంది !

అలాగే , ' కామం ' చేత ' జ్ఞానం ' కప్పబడి వుంది !

అలాగే, ' బహిర్ కామం ' చేత ' అంతర్ జ్ఞానం ' కప్పబడి వుంది !

కాస్త అద్దం మీద దుమ్ము తీసెయ్యాలి !

కాస్త నిప్పు మీద వున్న నివురు కదిలించాలి !

దట్సాల్ ! జస్ట్ దు ' ఆనాపానసతి - విపస్సన ' పై డియర్ !

ఇంద్రియాణి మనోబుద్ధి రస్యా ధిష్ఠానముచ్యతే ।
ఏతైర్విమోహయత్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥ *(3-40)*

**పదచ్ఛేదం :** ఇంద్రియాణి, మనః, బుద్ధిః, అస్య, అధిష్ఠానమ్, ఉచ్యతే, ఏతైః, విమోహయతి, ఏషః, జ్ఞానమ్, ఆవృత్య, దేహినమ్.

**టీకా :** ఇంద్రియాణి = ఇంద్రియాలు; మనః = మనస్సు; బుద్ధిః= బుద్ధి; అస్య = దీని యొక్క; అధిష్ఠానమ్ = ఆశ్రయం అని; ఉచ్యతే = చెప్పబడుతోంది; ఏషః = ఈ కామం; ఏతైః = వాటి ద్వారా; జ్ఞానమ్ = జ్ఞానాన్ని; ఆవృతస్య = కప్పివేసిన; దేహినమ్= జీవాత్మని; విమోహయతి = మోహిస్తుంది;

**తాత్పర్యం :** **" ఇంద్రియాలు, మనస్సు బుద్ధి- ఇవన్నీ కామానికి ఆశ్రయాలని చెప్పబడుతున్నాయి; ఆ ఇంద్రియాలలో కామం ఆత్మజ్ఞానాన్ని మరుగుపర చి జీవాత్మని మోహింపజేస్తుంది."**

**వ్యాఖ్యానం :**

" నిప్పు మీద వున్న నివురు మూడు పొరలు !"

1. ఇంద్రియాలు 2. మనస్సు 3. బుద్ధి

ఇక్కడ ' బుద్ధి ' అంటే ' సమాజం నుంచి అరువు తెచ్చుకున్న బుద్ధి ' అని అర్థం!

ఈ బుద్ధి మహాత్ముల దగ్గర నుంచి తెచ్చుకున్నది కాదు !

ఈ బుద్ధి ఆత్మజ్ఞానం ద్వారా వచ్చిన బుద్ధి కాదు !

మూర్ఖ సమాజం కేవలం ఓ మూర్ఖమైన బుద్ధినే ఇస్తుంది !

ఎలాగైతే శాస్త్రజ్ఞులు ' మంసం తినండి ' అని చెప్తారో అలాంటి బుద్ధి అన్నమాట !

ఎలాగైతే పూజార్లు ' విగ్రహాలను ఆరాధించ ' మని చెప్తారో ' అలాంటి బుద్ధి' అన్నమాట !

ఎలాగైతే డాక్టర్లు ' మీ రోగాలకు మా దగ్గర మందులు ' న్నాయని అంటారో అలాగ !

ఈ మూడూ కూడా కామ, క్రోధ, విశృంఖలత్వాలకు ఆశ్రయాలు !

ఇవి జీవాత్మను కప్పేసి, మరుగు పరిచి మోహింప చేస్తూంటాయి !

ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేఃపరతస్తు సః ॥ (3-42)

**పదచ్ఛేదం :** ఇంద్రియాణి, పరాణి, ఆహుః, ఇంద్రియేభ్యః, పరమ్, మనః , మనసః, తు, పరా, బుద్ధిః, యః, బుద్ధేః, పరతః, తు, సః;

**టీకా :** ఇంద్రియాణి = ఇంద్రియాలు; పరాణి = బలమైనవి; ఆహుః = అంటారు; ఇంద్రియేభ్యః = ఈ ఇంద్రియాల కన్నా; పరమ్= ఉత్తమమైంది; మనః = మనస్సు; మనసః తు = మనస్సుకంటే; పరా = శ్రేష్ఠం; బుద్ధిః= బుద్ధి; తు = మరి; యః= ఎవరు; బుద్ధేః= బుద్ధి కన్నా; పరతః= అత్యంత గొప్పదైన; సః= అతడే ఆత్మ.

**తాత్పర్యం :** " ఇంద్రియాలు బలమైనవి : ఇంద్రియాల కన్నా మనస్సు, మనస్సు కన్నా బుద్ధి గొప్పది : బుద్ధి కన్నా అత్యంత గొప్ప దానినే ' ఆత్మ ' అని అంటారు."

**వ్యాఖ్యానం :**

మూడు నివురుల్లో, మూడు ఆవరణల్లో, మూడు పొరల్లో మనం వున్నాం !

ఈ మూడు నివురుల్లో ఇంద్రియాల కన్నా మనస్సు బలమైనది !

మనస్సు కన్నా సంఘమిచ్చిన బుద్ధి బలమైనది !

మనస్సు చెప్పినట్లు ఇంద్రియాల వెంట పరిగెడతాం !

సంఘం ఇచ్చిన బుద్ధిని బట్టే మన మనః చేష్టలు వుంటాయి !

అయితే వీటన్నింటికంటే గొప్పది ' ఆత్మ ' !

' ఆత్మ బలం ' ముందర సంఘం తలవంచి తీరుతుంది !

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మా నమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ (3-43)**

**పదచ్ఛేదం :** ఏవమ్, బుద్ధేః, పరమ్, బుద్ధ్వా, సంస్తభ్య, ఆత్మానమ్, ఆత్మనా, జహి, శత్రుమ్, మహాబాహో, కామరూపమ్, దురాసనమ్.

**టీకా :** ఏవమ్ = ఈ విధంగా; బుద్ధేః = బుద్ధి కన్నా; పరమ్= అతీతమైనది; బుద్ధ్వా = తెలుసుకుని; ఆత్మనా = బుద్ధి ద్వారా; ఆత్మానమ్= మనస్సుని; సంస్తభ్య = వశపరుచుకుని; మహాబాహో = గొప్ప బాహు భుజాలు గల అర్జునా !; కామరూపమ్ = కామరూపంలో వుండే; దురాసధమ్ = జయించడానికి; శత్రుమ్= శత్రువును; జహి = చంపు.

**తాత్పర్యం :** ***" గొప్ప బాబహుంభుజాలు గల అర్జునా ! బుద్ధి కన్నా అతీతమైన ఆత్మను తెలుసుకుని బుద్ధి ద్వారా మనస్సుని వశపరచుకుని, శత్రువుని చంపి జయించు."***

**వ్యాఖ్యానం :**

కనుక, కృష్ణుడు ఈ విధంగా అంటున్నాడు –
" సంఘమిచ్చిన అల్ప బుద్ధికన్నా బలమైన ఆత్మని ఓ అర్జునా ! తెలుసుకో !
సంఘం చెప్పిన దానికి తల వంచకు !
ఆత్మను తెలుసుకో – ఆత్మ చెప్పిన దానికి తలవంచు !
ఆత్మ జ్ఞానం ప్రాప్తించక ముందు ' సంఘం ఇచ్చిన బుద్ధి ' మాత్రమే వుంటుంది !
ఆత్మ జ్ఞానం ప్రాప్తించిన తర్వాత వెంటనే ' ఆత్మ ఇచ్చిన బుద్ధి ' వస్తుంది !
మొదటిది అల్ప బుద్ధి ; రెండవది మహాత్మకమైన బుద్ధి !
' సంఘ బుద్ధి ' దుఃఖాలను కలిగిస్తే – ' ఆత్మ బుద్ధి ' ఆనందాన్ని కలిగిస్తుంది !
విశృంఖలమైన మనస్సు ఆత్మానుభవం ద్వారానే వశపరచబడుతుంది !
అప్పుడే ' క్రోధం ' అనే ' శత్రువు ' చంపబడుతుంది.
ఆత్మజ్ఞానం తదనంతరమే అరిషడ్ వర్గాలు ' మిత్రు షడ్ వర్గాలూ ' గా మారుతాయి !
' రజోగుణీ ' అయినా, ' తమోగుణీ ' అయినా మొట్టమొదటగా ఆత్మలో దూకండి !" అని కృష్ణుని సందేశం.
' ఆత్మలో దూకడం ' ఎలా ?
అది ఆనాపానసతి అభ్యాసం ద్వారానే జరుగుతుంది !

**బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥ (4-5)**

**పదచ్ఛేదం :** బహూని, మే, వ్యతీతాని, తవ, చ, అర్జున, తాని అహమ్, వేద, సర్వాణి, న, త్వమ్, వేత్థ, పరంతప.

**టీకా :** పరంతప = ఓ పరంతపా; అర్జున = అర్జునా; మే = నా యొక్క; చ = మరి; తవ = నీ యొక్క; బహూని = ఎన్నెన్నో; జన్మాని = జన్మలు; వ్యతీతాని = జరిగిపోయాయి; తాని = వాటి; సర్వాణి = అన్నింటినీ; త్వమ్= నువ్వు న, వేత్థ = తెలియదు; అహంవేద = నాకు తెలుసు.

**తాత్పర్యం :** **" శత్రువులను తపింప చేసే ఓ అర్జునా ! ఇంతకు ముందు నీకూ, నాకూ ఎన్నెన్నో జన్మలు గడిచిపోయాయి. అవి అన్నీ నీకు తెలియదు : అయితే నాకు మటుకు అన్నీ తెలుసు."**

**వ్యాఖ్యానం :**

మానవుడు జన్మపరంపరాగతుడు !

అంటే జన్మ పరంపరను ఎన్నుకుని వచ్చిన వాడు !

భౌతిక జీవితాన్ని అన్ని కోణాల్లోంచీ అనుభవించడానికే జన్మపరంపర !

ఒక్కో కోణం ఒక్కో జన్మకు అంకురార్పణ చేస్తుంది !

జీవితానికి ఎన్ని కోణాలో ! జన్మ పరంపరలో ఎన్ని జన్మలో !

అన్ని కోణాలనూ దర్శిస్తేనే మానవుడు పరిపూర్ణ మానవుడు అవుతాడు !

తన ' జన్మపరంపర ' గురించి తెలుసుకున్నవాడే ' జ్ఞాని ' !

తెలుసుకోనివాడే ' అజ్ఞాని ' !

అజ్ఞాని శోక సహితుడు. జ్ఞాని శోక రహితుడు.

జన్మ పరంపరలోని తుది దశల్లో మానవుడు ' నేను ఎవరు ?' అని తెలుసుకోవాలని అంతర్ మథనం మొదలుపెడ్తాడు !

అంటే, ఓ అజ్ఞాని మొదట ఓ జిజ్ఞాసువుగా మారతాడు !

జిజ్ఞాసువు ఓ గురువు దగ్గర చేసి ధ్యాన బోధ తీసుకుంటాడు !

మార్గం తెలుసుకున్న జిజ్ఞాసువు ధ్యాన సాధన ద్వారా తాను ' దివ్యచక్షువు '

సంపాదించుకుని తన జన్మపరంపరను తెలుసుకుంటాడు.

అర్జునుడు – ఓ జిజ్ఞాసువుకు సూచిక !

కృష్ణుడు – ఓ జ్ఞానికి సూచిక !

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తారమవ్యయమ్ ॥**

**పదచ్ఛేదం :** చాతుర్వర్ణ్యం, మయా, సృష్టిమ్, గుణకర్మవిభాగశ, తస్య, కర్తారమ్, అపి, మామ్, విద్ధి, అకర్తారమ్, అవ్యయమ్.

**టీకా :** చాతుర్వర్ణ్యం = ' బ్రాహ్మణ ', ' క్షత్రియ ', ' వైశ్య ', 'శూద్ర'– అనే నాలుగు వర్ణాల సముహం; గుణకర్మ విభాగశః = గుణాల చేత మరి కర్మల యొక్క విభాగాల ననుసరించి; ' మయా ' = ' నా చేత '; సృష్టిమ్ = సృష్టించబడ్డాయి; తస్య = కర్తారమ్; అపి= అయినప్పటికీ; ' మామ్ '= ' నన్ను ' అవ్యయమ్ = అవినాశినిగా; అకర్తారమ్ = అకర్తగానే; విద్ధి = తెలుసుకో.

**తాత్పర్యం :** " ' బ్రాహ్మణ ', ' క్షత్రియ ', ' వైశ్య ', ' శూద్రులు '– అనే నాలుగు వర్ణాల సముదాయం గుణ కర్మల విభాగాన్ని అనుసరించి ' నా చేత ' సృష్టించబడింది. ఈ రకమైన సృష్టి రచనకు కర్తను ' నేనే ' అయినప్పటికీ నాశరహితమైన ' నన్ను ' ' అకర్త ' గానే నువ్వు తెలుసుకో ! "

**వ్యాఖ్యానం :**

' వర్ణం ' అంటే రంగు – మనిషి యొక్క ' ఆరా ' యొక్క కలర్ !

ఆత్మ యొక్క ఉన్నతిని బట్టి ఆరా రంగులు మారుతూ వుంటాయి !

' ఆరా ' అంటే ' ఆస్ట్రల్ బాడీ ' యొక్క రంగులు.

' ఆస్ట్రల్ బాడీ ' అంటే మనోమయకోశం.

మనస్సు ' క్రోధం ' గా వున్నప్పుడు మనస్సు నల్లటి ఎర్రరంగు భూయిష్టం అవుతుంది.

మనస్సు ' లేకి ' గా వున్నప్పుడు నల్లటి ఆకుపచ్చరంగు కలిగి వుంటుంది.

గ్రుడ్డిగా ' నేనే ' సత్యం అని వాదిస్తున్నప్పుడు నల్లటి ఆరంజి రంగు కలిగి వుంటుంది.

మనస్సు ' నాకు తెలియదు ' అని ఒప్పుకున్నప్పుడు నిర్మలమైన ఊదా నీలిరంగు కలిగి వుంటుంది.

' పునర్ జన్మ ' మరి ' కర్మసిద్ధాంతం ' ల అవగాహన వచ్చినప్పుడు వైలెట్ రంగుని కలిగి వుంటుంది.

' ముముక్షువు ' గా మారి తీవ్ర సత్యశోధన కలిగినప్పుడు మనస్సు ఇండిగో రంగుని కలిగి వుంటుంది.

మనస్సు పూర్తిగా ' శుద్ధం ' అయినప్పుడు ' అహం బ్రహ్మాస్మి ' అని తెలుకున్నప్పుడు పసుపు పచ్చబంగారు వర్ణాన్ని కలిగి వుంటుంది.

' దివ్యచక్షువు ' తోనే యోగులు ఈ రంగులను అనేక మానవులలలో దర్శిస్తారు.

ఒకటి, రెండు రంగులను ' శూద్రవర్ణం ' గా, తమోగుణంగా, అభివర్ణించారు !

రెండు, మూడు రంగులను 'వైశ్యవర్ణం' గా, 'రజోగుణం' గా, అభివర్ణించారు !

నాలుగు, ఐదు, ఆరు రంగులను ' క్షత్రియ వర్ణం ' గా, ' స్వాత్వికంగా ' గా అభివర్ణించారు.

ఏడవ రంగును ' బ్రాహ్మణ వర్ణం ' గా ' శుద్ధ సాత్వికంగా ' గా లేదా ' నిర్గుణం ' గా అభివర్ణించారు.

అంతర్ గుణాన్ని బట్టే బహిర్ కర్మ సదా వ్యక్తం అవుతూ వుంటుంది !

బయట కర్మను బట్టి అంతర్ గుణం బుద్ధికి గ్రాహ్యం అవుతుంది.

తమోగుణం లోని వారిని శూద్రులుగా –

రజోగుణం లోని వారిని వైశ్యులుగా –

సాత్విక గుణం వారిని క్షత్రియులుగా –

శుద్ధ సాత్విక్షం లేదా నిర్గుణం వారిని బ్రాహ్మణులుగా – పూర్వపు ఋషులు సమాజాన్ని నాలుగు విభాగాలు గా విభజించారు.

' మయా సృష్టం ' అన్న పదానికి అర్థం " ' నా ' చేత సృష్టింపబడ్డవి ".

ఇక్కడ ' నా ' అంటే ' కృష్ణుడు ' అని కాదు ! వాస్తవానికి భగవద్గీతలో ఎక్కడెక్కడ ' మాం ', ' మయి ' అని వచ్చినా కూడా అవి కృష్ణునికి సూచికలు ఎంత మాత్రం కావు !

' ఎవరికి వారే ' ఆ పద ప్రయోగంలో సూచింపబడతారు !
' అహం ' అన్నప్పుడే కృష్ణుడు గానీ ఆస్ట్రల్ మాస్టర్స్ గానీ సూచింప బడతారు.
బగవద్గీతలోని ' గీతా రహస్యం ' ఇదే !
ప్రతి శ్లోకం లోనూ మొదటి పాదంలో ' మాం ', ' మయి ', అనీ
రెండవ పాదంలో ' అహం ' అనీ ఉపయోగించబడుతుంది.
' అహం ' అన్నప్పుడల్లా శ్రీ కృష్ణుడు తన సొంత వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తున్నారు.
తనను తాను ప్రత్యేకంగా సూచించుకుంటున్నాడు.
పైన వున్న మాస్టర్స్, పైన వున్న దేవుళ్ళు ఎప్పుడూ ' క్రింద వున్న మానవుల '
గుణకర్మలను నిర్దేశించరు !
ఎవరి గుణ కర్మలను ఎవరికి వారే ఎప్పటికప్పుడు నిర్ణయించుకుంటూ వుంటారు.
' నేను ' అన్న పదార్థం ఒక్క ప్రక్క నిరంతర మన గుణకర్మలను
సృష్టించుకుంటున్నా– మరొక ప్రక్క దేనినీ సృష్టించని, దేనికీ కర్త
గానీ అవినాశి అయినా అవ్యయమైన ' మూల పదార్థం ' అని కూడా
తెలుసుకోవాలి – అదే జ్ఞానం.
అంటే ప్రతి ' నేను ' కూడా, ప్రతి ' ఆత్మ ' కూడా ఒక ప్రక్క సృష్టికర్త
– మరొక ప్రక్క సృష్టి సాక్షి.

**కర్మణ్య కర్మ యః పశేయదకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥ (4-18)**

**పదచ్ఛేదం :** కర్మణి, అకర్మ, యః, పశ్యేత్, అకర్మణి, చ, కర్మ, యః, సః, బుద్ధిమాన్, మనుష్యేషు, సః, యుక్తః, కృతకర్మకృత్.

**టీకా :** యః = మానవుడు; కర్మణి = కర్మలో; అకర్మ = అకర్మను; పశ్యేత్ = చూస్తాడో; సః = అతడు; మనుష్యేషు = మనుష్యులలో; బుద్ధిమాన్ = తెలివి కలవాడు; సః = అతడే; యుక్తః = సరైనవాడు; కృత్స్న కర్మకృత్ = సమస్త కర్మలను ఆచరిస్తున్నాడు.

**తాత్పర్యం :** **"ఏ మానవుడు కర్మలో అకర్మనూ, మరి అకర్మలో కర్మనూ చూస్తాడో అతడే మనుష్యులలో తెలివైనవాడు ; అతడే యోగయుక్తుడై సమస్త కర్మలనూ ఆచరిసున్నవాడు."**

**వ్యాఖ్యానం :**

మనుష్యులలో రెండు రకాల మనుష్యులు వున్నారు.

1. బుద్ధివున్న వాళ్ళు - బుద్ధిలేని వాళ్ళు 2. యుక్తజీవులు - యుక్త జీవులు కాని వాళ్ళు ఎవరు బుద్ధివున్న వాళ్ళు ?

శ్రీ కృష్ణుడు ఈ విధంగా చెప్తున్నాడు -

బాహ్యకర్మల్లో 'శూన్యా' న్ని చూడాలి ! అంతర్ కర్మల్లో 'సత్యా' న్ని చూడాలి !

అలా చూడగలిగిన వాడే బుద్ధిమంతుడు !

బాహ్య కర్మలు అంతర్ కర్మలకు ఫలితాలు !

'అంతర్ కర్మ' అంటే ఆలోచనలు !

ఆలోచనలే శక్తి కూడకట్టుకున్నప్పుడూ, దీక్ష వహించినప్పుడూ బాహ్య 'వ్యవహారాలు' గా మారుతాయి !

'కర్మ' అంటే 'వ్యవహారం' - కంటికి కనపడేది.

అంతర్ ఆలోచనలే బహిర్ కార్యకలాపాలు గా మారుతాయి !

ఈ ' సృష్టి క్రమాన్ని ' ఎరిగిన వాడే ఏ పనినైనా సరిగ్గా చేయగలడు.

' యుక్తః ' అంటే, సరిగ్గా కర్మలను చేయగలిగినవాడు.

ఒక పనిని ఒక సమయంలో సరిగ్గా చేయగలిగినవాడే క్రమక్రమంగా ఒకే సమయంలో ఎన్నో పనులనూ చేపట్టగలడు -

' అష్టావధాని ' కాగలడు ! ' శతావధాని ' కాగలడు ! సహస్రావధాని కాగలడు !

**యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః ।**

**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః తమాహుః పండితం బుధాః॥ (4-19)**

**పదచ్ఛేదం :** యస్యసర్వే, సమారంభాః, కామసంకల్ప వర్జితా, జ్ఞానాగ్ని దగ్ధకర్మాణాం, తమ్, ఆహుః, పండితమ్, బుధాః.

**టీకా :** యస్య = ఎవరి; సర్వే = సమస్త; సమారంభాః = కర్మలు; కామ సంకల్ప వర్జితాః= ఎలాంటి కోరికలూ; సంకల్పాలూ లేక, జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణా= మరి సకల కర్మలు జ్ఞానాగ్నిలో భస్మమై పోయాయో; తమ్ = అలాంటి మహాపురుషుణ్ణి; బుధాం= జ్ఞానులు; పండితమ్= పండితుడని; ఆహుః= చెప్తున్నారు.

**తాత్పర్యం :** **"ఎవరి సమస్త కర్మలన్నీ ఎలాంటి కోరికలూ, సంకల్పాలూ లేకుండా జ్ఞానాగ్నిలో భస్మమైపోతాయో అలాంటి మహా పురుషుణ్ణి జ్ఞానులు పండితుడని చెప్తారు."**

**వ్యాఖ్యానం :**

మనిషి కోరికల మయం !

ప్రతి కోరికా సంకల్పంతోనే తీరుతుంది ! కోరికలు వర్జించబడాలి.

' కోరికలు ' అంటే ఇక్కడ అర్థం ' ప్రాపంచికమైన కోరికలు ' అని !

ప్రాపంచిక కోరికలకు సంబంధించిన సంకల్పాలు వర్జించబడాలి.

అలాంటి వాళ్ళే పండితులు !

' కర్మ ' - అంటే స్వార్థపూరితమైన కర్మలు - అంటే ప్రాపంచికమైన కర్మలు దగ్ధం అయిపోవాలి. అప్పుడే ఒకానొకడు పండితుడు కాగలడు.

అలా కాకపోతే అతడు పామరుడే !

ప్రాపంచిక కర్మల్లో, ప్రాపంచిక కోరికల్లో ఓలలాడే వాడే పామరుడు !

ఆధ్యాత్మిక కర్మల్లో, ఆధ్యాత్మిక కోరికల్లో ఓలలాడే వాడే పండితుడు !

ప్రాపంచిక కర్మలూ, ప్రాపంచిక కోరికలూ- అన్నీ దగ్ధం అయినప్పుడే ఆధ్యాత్మిక కర్మలూ, ఆధ్యాత్మిక కోరికలూ మొదలవుతాయి.

' జ్ఞానం ' అనే అగ్ని రగలక ముందు పామరుడు !

' జ్ఞానం ' అనే అగ్ని రగిలిన తర్వాత పండితుడు !

' జ్ఞానం ' అంటే ' ఆత్మ జ్ఞానం ', ' అగ్ని ' అంటే 'తీవ్రత '.

' జ్ఞానాగ్ని ' అంటే ' ఆత్మ జ్ఞానం యొక్క తీవ్రత !'

ధ్యానాగ్నిలోనే జ్ఞానాగ్ని !

' ధ్యానాగ్ని ' అనే హోమగుండంలోనే ' జ్ఞానం ' అనే అగ్ని రగిలేది ! – జ్ఞానాగ్ని ఎగసేది !

**యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ (4-22)**

పదచ్ఛేదం : యదృచ్ఛాలాభ సంతుష్టః, ద్వంద్వాతీతః, విమత్సరః, సమః, సిద్ధౌ, చ, కృత్వా, అపి, న, నిబధ్యతే.

టీకా : యదృచ్ఛాలాభసంతుష్టః= కోరుకోకుండానే లభించిన వస్తువులతో ఎల్లప్పుడూ తృప్తి పొందేవాడు; విమత్సరః= ఎవరి పట్లా లేశమాత్రమైనా ఈర్ష్య లేకుండా; ద్వంద్వాతీతః= సుఖదుఃఖాలను అతిక్రమించినవాడు; సిద్ధౌ = ప్రాప్తం లోనూ; అసిద్ధౌ = అప్రాప్తిలోనూ; సమః = సమబుద్ధి కలవాడు; కృత్వా, అపి = కర్మలు చేసినప్పటికీ; న, నిబధ్యతే = బంధింపబడడు.

తాత్పర్యం : **" కోరుకోకుండానే లభించిన వస్తువుతో ఎల్లప్పుడూ తృప్తిపొందేవాడు : ఎవరి పట్లా లేశమాత్రమైనా ఈర్ష్య లేనివాడూ, ప్రాప్తంలోనూ, అప్రాప్తంలోనూ సమబుద్ధి కలవాడూ కర్మలు చేసినప్పటికీ వాటిచే బంధింపబడడు."**

వ్యాఖ్యానం :

" కోరి సాధించరాదు !
కోరక వచ్చినది కాదనరాదు !
వస్తూంటే వస్తోందని సంబరపడరాదు !-
పోతూ వుంటే పోతోందని బాధ పడరాదు ! "
అని కర్నూలు సదానందయోగి 1981లో నాకు చేసిన ప్రబోధం.
అంతా మనమే ! కనుక, ఎవరి పట్ల ఈర్ష్య ?
పని జరగడానికి కష్టపడాలి !
కానీ, పని జరిగినా జరక్కపోయినా చలించకూడదు !
ఈ విధంగా జీవించడమే బంధ విమోచన మార్గం.
యోగ సాధన ద్వారానే ఈ జ్ఞానం లభ్యం !
జ్ఞానం లభ్యమైన తర్వాతే సరైన కర్మాచరణం -
అంటే, ఆధ్యాత్మిక జ్ఞాన పూరితమైన కర్మాచరణ సాధ్యం.
ఆధ్యాత్మిక జ్ఞాన పూరిత కర్మాచరణే ముక్తి మార్గం.



యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వాసమత్వం యోగ ఉచ్యతే ॥

' యోగస్థితి ' లోనే కర్మలన్నీ చేయాలి !

' యోగస్థితి ' లో వుండకుండా చేసి

కర్మలన్నీ అనర్థహేతువులే !

కర్మలను చేస్తూ వున్నా వాటిపట్ల

ఆసక్తి రహితుడిలాగా వుండాలి !

పిరమిడ్ పబ్లికేషన్స్

Rs : 25/-